గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సీ ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.

# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల కోసం...
24 X 7
GAUTHAM NEWS
Voice of Truth...
GAUTHAM NEWS TV

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 244, ఎడిటర్,భీముడు నాయక్ పేజీలు : 12, వెల రూ. 1, శనివారం - 12 - అక్టోబర్ - 2024
PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ




గ్రామస్థాయిలో చైర్మన్‌గా సర్పంచ్ లేదా ప్రత్యేక అధికారి

మున్సిపాలిటీలో చైర్మన్‌గా కౌన్సిలర్ లేదా కార్పొరేటర్

కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు ఆఫీసర్

**హైదరాబాద్ :** పంచాయతీ, మున్సిపల్, వార్డు స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం జీవో జారీ చేసింది. గ్రామస్థాయిలో సర్పంచ్ లేదా ప్రత్యేక అధికారి, మున్సిపాలిటీ స్థాయిలో కౌన్సిలర్ లేదా కార్పోరేటర్ చైర్మన్‌గా ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు ఆఫీసర్ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ కన్వీనర్‌గా ఉంటారని

## 5వేల స్కూళ్లు మూసేశారు..
## కేసీఆర్‌పై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్ రెడ్డి

- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టాం
- రాష్ట్రంలో 21 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు కల్పించాం
- పదేళ్లలో రూ.7 లక్షల కోట్లు అప్పు చేసిన కేసీఆర్
- తాము 90 రోజుల్లోనే 30వేల మందికి ఉద్యోగాలిచ్చాం

**హైదరాబాద్ :** తండాలు, మారుమూల పల్లెలు, బస్తీల్లో నివసించే నిరుపేదలకు మంచి వైద్యం, నాణ్యమైన విద్యను అందించడం ద్వారా ఒక ఆరోగ్యవంతమైన తెలంగాణను నిర్మించాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నిరుపేదలను విద్యకు దూరం చేయకూడదన్న ఆలోచనతో చాలా మంది మేధావులు, సామాజిక తత్వవేత్తలతో చర్చించిన తర్వాత యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు.




## ఏపీకి నిధులు..
## తెలంగాణకు గుండు సున్నా




కేంద్రంపై హరీశ్ ఫైర్

గోదావరి పుష్కరాలకు ఏపీకి రూ. 100 కోట్లు ఇచ్చారన్న హరీశ్

కేంద్ర బడ్జెట్ లో ప్రత్యేక నిధుల కింద రూ. 15 వేల కోట్లు ఇచ్చారని వ్యాఖ్య

తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపాటు

## డీఎస్పీగా మహ్మద్ సిరాజ్




- నియామక పత్రాన్ని అందించిన డీజీపీ జితేందర్
- ప్రభుత్వం, పోలీస్ శాఖకు సిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు
- టీ20 వరల్డ్ కప్ అనంతరం సిరాజ్‌కు ఇంటి స్థలం, ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం

**హైదరాబాద్ :** టీ20 ప్రపంచ కప్ సాధించిన భారత జట్టులో భాగమైన క్రికెటర్ మొహమ్మద్ సిరాజ్‌కు

## రేవంత్ రెడ్డి స్వయంగా మూసీ ప్రాంతంలో పర్యటించి...
# కూల్చివేతలకు ఒప్పించాలి

- కూల్చివేతలు అంత ఈజీ కాదన్న కిషన్ రెడ్డి
- మూసీ రిటర్నింగ్ వాల్‌ను నిర్మించి కూడా సుందరీకరణ చేయవచ్చునని వెల్లడి
- రేస్ కోర్స్ అవీ మరీ సుందరీకరణ పనులు అవసరం లేదన్న కేంద్రమంత్రి




## బంగ్లాదేశ్‌లో షాకింగ్ ఘటన..
## ప్రధాని మోదీ బహుమతిగా ఇచ్చిన కాళీ మాత కిరీటం చోరీ

- జెషోరేశ్వరి ఆలయానికి 2021లో మోదీ బహుమతిగా ఇచ్చిన కిరీటం అపహరణ
- పారిశుద్ధ్య సిబ్బంది గుర్తింపుతో వెలుగులోకి
- భారత పురాణాల ప్రకారం జెషోరేశ్వరి ఆలయానికి విశిష్ట ప్రాధాన్యత




## టాటా ట్రస్ట్ చైర్మన్‌గా రతన్ టాటా సోదరుడు నోయెల్ టాటా నియామకం




- టాటా ట్రస్ట్ చైర్మన్‌గా నోయెల్ టాటాకు ఆమోదం తెలిపిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు
- రతన్ టాటా సవతి తల్లి కొడుకే నోయెల్ టాటా
- 2000 ఆరంభంలో కంపెనీలోకి అడుగు

**న్యూఢిల్లీ, :** నాటి నుంచి కంపెనీ ఎదుగుదలకు విశేషంగా కృషి చేస్తున్న నోయెల్ టాటా రతన్ టాటా మరణం తర్వాత టాటా గ్రూపు నిర్వహణకు సంబంధించి కీలక పరిణామం

## తెలుగు ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన జగన్

- ఏపీ, తెలంగాణ ప్రజలకు జగన్ పండుగ శుభాకాంక్షలు
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరూ బాగుండాలన్న వైసీపీ అధినేత
- అమ్మవారి కటాక్షం ప్రతి ఒక్కరికీ లభించాలని ఆకాంక్ష



**అమరావతి :** ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి పర్వదినాలను పురస్కరించుకుని ఏపీ, తెలంగాణ ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. లోక కంఠకుడైన మహిషాసురుడిని జగన్మాత సంహరించినందుకు, చెడుపై మంచి సాధించిన విజయానికి, దుష్ట శక్తులపై దైవ శక్తుల గెలుపునకు ప్రతీకగా జరుపుకునే పండుగ దసరా అని జగన్ వివరించారు. చెడు ఎంత దుర్మార్గమైనదైనా, ఎంత శక్తిమంత మైనదైనా... మంచితనాన్నే అంతిమ విజయం వరిస్తుందని పేర్కొన్నారు. ఆ జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ శాంతులతో, సిరిసంపదలతో తులతూగాలని, రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించాలని... ఆ కనకదుర్గమ్మ దీవెనలు, ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని జగన్ ఆకాంక్షించారు.

# పిఠాపురం అభివృద్ధికి టాప్ గేర్ వేసిన పవన్ కళ్యాణ్!

పిఠాపురం ప్రజల కోసం పవన్ కీలక నిర్ణయం

పిఠాపురంలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందాలు

**అమరావతి :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం గా బాధ్యతలు




# జమిలికి చంద్రబాబు సై
# ఏపీలో ముందస్తు, జగన్ కు కలిసొచ్చేనా..!!

ఏపీలో 2027లోనే ఎన్నికలు..?

చంద్రబాబు సిద్ధం

కలిసొచ్చేదెవరికి

**అమరావతి :** ఏపీలో ముందస్తు ఎన్నికలు ఖాయమా. షెడ్యూల్ ప్రకారం 2029లో జరగాల్సిన ఎన్నికలు 2027 ద్వితీయార్థంలో జరగనున్నాయా. ఢిల్లీ నుంచి అమరావతి వరకు జరుగుతున్న చర్చలు అవుననే అంటున్నాయి. తాజాగా ఢిల్లీ పర్యటన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు జమిలి ఎన్నికలకు మద్దతు ప్రకటించారు. కేంద్రం జమిలి దిశగా వేగంగా అడుగులు వేస్తుంది. చంద్రబాబు తాజా ప్రకటన తరువాత ఏపీలో కూటమి ప్రభుత్వం ఏం చేయబోతోంది. మాజీ సీఎం జగన్ యాక్షన్ ప్లాన్ ఏంటి. కలిసొచ్చేదెవరికి.

ఏపీలో 2027లోనే ఎన్నికలు..?

ఒకే దేశం-ఒకే ఎన్నికలు. 2024




ఎన్నికలకు ముందే దీనికి సంబంధించి కేంద్రం పక్కా ప్లాన్ తో వ్యవహరించింది. మాజీ రాష్ట్రపతి కోవింద్ తో కమిటీ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నివేదిక కూడా ఇచ్చింది. కొద్ది రోజుల క్రితం కేంద్రం ఆ రిపోర్టును ఆమోదించింది.

## తిరుమల శ్రీవారి చక్రస్నానానికి ఘనంగా ఏర్పాట్లు



- నేటితో ముగియనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- చక్రస్నానానికి భక్తులు వేలాదిగా తరలివస్తారని అంచనా
- 40 వేల సిబ్బంది సేవలు ఉపయోగించుకుంటామన్న టీటీడీ ఈవో

## కియా షోరూమ్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు




- రాష్ట్రం నుంచి తరలి వెళ్లిన పెట్టుబడులను తిరిగి తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటామన్న మంత్రి
- ఏపీకి సీఎం చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అంటూ ప్రశంసలు
- జగన్ జిల్లాల పర్యటనకు వెళితే చట్ట ప్రకారం అనుమతి ఇస్తామని వెల్లడి
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

**అమరావతి :** మంగళగిరి పరిధిలోని కొలనుకొండలో కియా కార్ల షోరూమ్‌ను మంత్రి నారా లోకేశ్ ఇవాళ (శుక్రవారం) ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలకమైన వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి, పెట్టుబడుల విషయంలో పక్క రాష్ట్రాలతో ఏపీ పోటీ పడాలని అన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టబోమని, పక్క రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడతామన్న వారందరినీ తిరిగి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన చెప్పారు. టీసీఎస్, లులూ, రిలయన్స్ వంటి కంపెనీలు ప్రస్తుతం ఏపీ వైపు చూస్తున్నాయని ఆయన అన్నారు. దానికి కారణం మన బ్రాండ్ అంబాసిడర్, ఆయన పేరే

# ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ

మొదటి పేజి తరువాయి

పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు ఆఫీసర్ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ కన్వీనర్‌గా ఉంటారని జీవోలో ప్రభుత్వం పేర్కొంది. ఇద్దరు ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులు, ముగ్గురు స్థానికులు కమిటీలో సభ్యులుగా ఉంటారని పేర్కొంది. ఈ కమిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ కొనసాగనుంది. శనివారం నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. కమిటీల కోసం పేర్లు పంపించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం ఆదేశించింది.

# ఏపీకి నిధులు.. తెలంగాణకు గుండు సున్నా

మొదటి పేజి తరువాయి

**హైదరాబాద్ :** తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం మరోసారి గుండు సున్నా ఇచ్చిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. గోదావరి పుష్కరాల కోసం ఏపీకి కేంద్రం రూ. 100 కోట్ల నిధులు ఇచ్చిందని... తెలంగాణకు మాత్రం గుండు సున్నా ఇచ్చిందని మండిపడ్డారు. తెలంగాణకు రావాల్సిన నిధుల కోసం పోరాడడంలో బీజేపీ, కాంగ్రెస్ ఘోరంగా విఫలమయ్యాయని దుయ్యబట్టారు. మన రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా... ఒక్క రూపాయి కూడా కేంద్రం తెలంగాణకు ఇవ్వలేదని అన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు వచ్చింది సున్నా అని... ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక నిధుల కింద రూ. 15 వేల కోట్లు మంజూరయ్యాయని వ్యాఖ్యానించారు. లోక్‌సభలో బీఆర్ఎస్ బలమైన స్థానంలో ఉండి ఉంటే.. ఈ అన్యాయాన్ని తాము జరగనిచ్చే వాళ్లం కాదని అన్నారు. మరోసారి తెలంగాణను పక్కన పెట్టారా? అని ప్రశ్నించారు. ఈ పక్షపాత ధోరణి ఎందుకని అడిగారు. ఇతర రాష్ట్రాలతో సమాన వాటాను తెలంగాణ డిమాండ్ చేస్తోందని చెప్పారు.

# డీఎస్పీగా మహ్మద్ సిరాజ్

మొదటి పేజి తరువాయి

**హైదరాబాద్ :** టీ20 ప్రపంచ కప్ సాధించిన భారత జట్టులో భాగమైన క్రికెటర్ మొహమ్మద్ సిరాజ్‌కు ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఆగస్టు నెలలో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 78లో 600 చదరపు గజాల స్థలాన్ని సిరాజ్‌కు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో తాజాగా శుక్రవారం మహ్మద్ సిరాజ్‌కు డీఎస్పీ పోస్టు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ జితేందర్.. సిరాజ్‌కు డీఎస్పీ నియామక పత్రాలు అందజేశారు. దీంతో సిరాజ్ డీఎస్పీగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖకు సిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహ్మద్ సిరాజ్ వెంట ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, టీజీఎంఆర్ఈఐఎస్ అధ్యక్షుడు మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ ఉన్నారు. కాగా, అంతర్జాతీయ క్రికెట్‌లో భారత దేశానికి, మన తెలంగాణ రాష్ట్రానికి గొప్ప పేరు, గౌరవాన్ని తెచ్చాడంటూ మొహమ్మద్ సిరాజ్‌ను సీఎం రేవంత్ అభినందించారు. టీ20 వరల్డ్ కప్‌ను గెలిచిన అనంతరం హైదరాబాద్‌కు చేరిన సిరాజ్ సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సిరాజ్‌ను సీఎం ఘనంగా సన్మానించారు. సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్‌లో తన అద్భుతమైన ప్రతిభను ప్రదర్శిస్తున్నాడని, అందుకే ఈ రోజు అత్యున్నత స్థాయి క్రికెటర్లలో ఒకడిగా పేరు సంపాధించాడని సీఎం రేవంత్ కొనియాడారు. టీమిండియాలో ఏడేళ్లు సేవలు అందిస్తుండటమేగాక, ఐసీసీ టీ20 వరల్డ్ కప్ టీమిండియా గెలుపు బృందంలో సిరాజ్ ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో అడుగుపెట్టిన సిరాజ్‌కు హైదరాబాద్‌లో క్రికెట్ అభిమానులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సిరాజ్‌ను సన్మానించడంతోపాటు నజరానాలను ప్రకటించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రికి మహమ్మద్ సిరాజ్ తన ప్రగాఢమైన అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. అనిల్ కుమార్ యాదవ్, ఫహీముద్దీన్ ఖురేషీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా క్రీడాకారుల అభివృద్ధికి స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలనే దార్శనికతను ప్రస్తావిస్తూ క్రీడలను ప్రోత్సహించడంలో ముఖ్యమంత్రికి ఉన్న అంకితభావాన్ని ప్రస్తావించారు. ముఖ్యమంత్రి రేవంత్ మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా క్రీడా సదుపాయాలను ఏకీకృతం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను కూడా వారు గుర్తించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీ స్థాపనకు సంబంధించిన పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు.

# బంగ్లాదేశ్‌లో షాకింగ్ ఘటన..

## ప్రధాని మోదీ బహుమతిగా ఇచ్చిన కాళీ మాత కిరీటం చోరీ



మొదటి పేజి తరువాయి

**న్యూఢిల్లీ, :** బంగ్లాదేశ్‌లో షాకింగ్ ఘటన వెలుగుచూసింది. సత్‌ఖిరాలోని జెషోరేశ్వరి ఆలయానికి మార్చి 2021లో భారత ప్రధాని నరేంద్ర మోదీ కానుకగా ఇచ్చిన కాళీ దేవి కిరీటం చోరీకి గురైంది. గురువారం మధ్యాహ్నం ఆలయ పూజారి పూజలు ముగించుకుని వెళ్లిన తర్వాత ఈ చోరీ జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది క్లీనింగ్ చేస్తున్న సమయంలో కిరీటం తప్పిపోయినట్లుగా గుర్తించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆలయాన్ని తరతరాలుగా చూసుకుంటున్న కుటుంబానికి చెందిన జ్యోతి ఛటోపాధ్యాయ మాట్లాడుతూ.. ఈ కిరీటాన్ని వెండితో తయారు చేశారని, బంగారు పూత పూసినట్లు ఆమె వివరించారు. ఈ కిరీటం సాంస్కృతికంగా, మతపరంగా ప్రాముఖ్యతను సంతరించుకుందని అన్నారు. కాగా 2021లో తన పర్యటనలో ప్రధాని మోదీ ఈ కిరీటాన్ని ఆలయానికి బహుమతిగా బహూకరించారు. బహుళ ప్రయోజనాల కోసం ఆలయం వద్ద భారత్ ఒక కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తుందని ప్రధాని మోదీ తన పర్యటనలో హామీ ఇచ్చారు. స్థానిక ప్రజలకు సామాజిక, మతపరమైన, విద్యా కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తుపానుల వంటి విపత్తుల సమయాల్లో కూడా అందరికీ ఆశ్రయం కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఆలయానికి విశిష్ట ప్రాధాన్యత

కాగా హిందూ పురాణాల ప్రకారం.. భారతదేశంతో పాటు పొరుగు దేశాలలో విస్తరించి ఉన్న 51 శక్తి పీఠాలలో జెషోరేశ్వరి ఆలయం ఒకటిగా ఉంది. ఈ ఆలయాన్ని 12వ శతాబ్దం చివరి భాగంలో అనారి అనే బ్రాహ్మణుడు నిర్మించాడని విశ్వసిస్తున్నారు. ఏకంగా 100 తలుపులతో ఆలయాన్ని నిర్మించడం విశేషం. అనంతర కాలంలో 13వ శతాబ్దంలో లక్ష్మణ్ సేన్ ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. ఆ తర్వాత 16వ శతాబ్దంలో రాజా ప్రతాపాదిత్య ఈ ఆలయాన్ని పునర్నిర్మించాడు.

# టాటా ట్రస్ట్ ఛైర్మన్‌గా రతన్ టాటా సోదరుడు నోయెల్ టాటా నియామకం

మొదటి పేజి తరువాయి

నోయెల్ టాటా రతన్ టాటా మరణం తర్వాత టాటా గ్రూపు నిర్వహణకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. టాటా ట్రస్ట్‌ల ఛైర్మన్‌గా రతన్ టాటా పిన సోదరుడు నోయల్ టాటా నియమితులయ్యారు. ఈ మేరకు ముంబైలో ఇవాళ (శుక్రవారం) జరిగిన బోర్డు సమావేశంలో కమిటీ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. నోయెల్ టాటా ప్రస్తుతం టాటా స్టీల్, టైటాన్ కంపెనీలకు వైస్ ఛైర్మన్‌గా ఉన్నారు. నోయెల్ టాటా 2000 ఆరంభంలో టాటా గ్రూపులో అడుగుపెట్టారు. ఆ నాటి నుంచి టాటా గ్రూప్ పురోగమనంలో ఆయన కూడా కీలక వ్యక్తిగా కృషి చేస్తున్నారు. సర్ రతన్ టాటా ట్రస్ట్, దొరాబ్జీ టాటా ట్రస్ట్‌ల సమావేశం అనంతరం ఇవాళ ఆయనను ఛైర్మన్‌గా ఎంపిక చేశారు. కాగా దివంగత రతన్ టాటా 1937లో సాంప్రదాయ పార్శీ కుటుంబంలో జన్మించారు. అయితే ఆయన 10వ ఏట తల్లిదండ్రులు నావల్ టాటా - సూనీ టాటా విడాకులు తీసుకున్నారు. దీంతో రతన్ టాటా తన అమ్మమ్మ వద్ద పెరిగాయి. తండ్రి రెండవ పెళ్లి చేసుకున్నారు. నోయెల్ టాటా తల్లి సిమోన్ టాటాయే రతన్ టాటాకు సవతి తల్లి. ఆమె ఒక ఫ్రెంచ్-స్విస్ కాథలిక్. ప్రస్తుతం ట్రెంట్, వోల్టాస్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టాటా ఇంటర్నేషనల్ కంపెనీలకు ఆమె ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఇక రతన్ టాటా తమ్ముడు జిమ్మీ వ్యాపారంలో అడుగుపెట్టలేదు. దక్షిణ ముంబైలోని కొలాబాలో నిరాడంబరమైన జీవితాన్ని గడుపుతున్నారు. కేవలం రెండు బెడ్‌రూమ్‌లు ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఆయన నివసిస్తున్నారు. కాగా టాటా సన్స్ ట్రస్ట్ కింద మొత్తం 14 ట్రస్ట్‌లు ఉన్నాయి. అయితే టాటా సన్స్ యాజమాన్యంలో ఎక్కువ భాగాన్ని సర్ రతన్ టాటా ట్రస్ట్, దొరాబ్జీ టాటా ట్రస్ట్‌లే నిర్వహిస్తుంటాయి. ఈ రెండు ట్రస్టులు ఉమ్మడిగా 50 శాతానికి పైగా యాజమాన్యాన్ని కలిగివున్నాయి. టాటా ట్రస్ట్‌లో ప్రస్తుతం వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్, మెహ్లీ మిస్త్రీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారు.

# తిరుమల శ్రీవారి చక్రస్నానానికి ఘనంగా ఏర్పాట్లు

మొదటి పేజి తరువాయి

**అమరావతి :** తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. రేపు స్వామివారికి చక్రస్నానం ఘట్టం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భారీగా ఏర్పాట్లు చేస్తోంది. దీనిపై టీటీడీ ఈవో జె.శ్యామలరావు మీడియాతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో చివరి అంకం చక్రస్నానానికి 30 వేల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. భక్తుల రాకకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఎంట్రీ గేట్లు, ఎగ్జిట్ గేట్లు ఏర్పాటు చేశామని... భద్రతాపరంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని వివరించారు. మొత్తం 40 వేల మంది సిబ్బంది సేవలు వినియోగించుకుంటామని... పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారని ఈవో శ్యామలరావు వెల్లడించారు. స్వామివారి పుష్కరిణి వద్ద రెండు బోట్లు కూడా సిద్ధంగా ఉంచామని తెలిపారు.

# 5వేల స్కూళ్లు మూసేశారు.. కేసీఆర్‌పై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజి తరువాయి



నిరుపేదలను విద్యకు దూరం చేయకూడదన్న ఆలోచనతో చాలా మంది మేధావులు, సామాజిక తత్వవేత్తలతో చర్చించిన తర్వాత యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. దసరా పండుగ శుభ సందర్భంగా రంగారెడ్డి జిల్లా, షాద్‌నగర్ నియోజకవర్గం, కొందుర్గ్‌లో ఇంటిగ్రేటెట్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. తర్వాత ఏర్పాటు చేసిన వేదిక నుంచి మాట్లాడుతూ ఆ పాఠశాలల ప్రాముఖ్యాన్ని వివరించారు. "ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వేర్వేరు చోట్ల విద్యా బోధన వల్ల ఈ వ్యవస్థ మమ్మల్ని దూరం పెడుతుందన్న భావన విద్యార్థుల్లో కలిగే ప్రమాదం ఉంది. అలాంటి భావన సమాజానికి, దేశానికి మంచిది కాదు. అందుకే పాతిక ఎకరాల్లో ఒకే క్యాంపస్‌లో అందరూ కలిసిమెలిసి ఒక సోదర భావంతో చదువుకుని రాణించాలన్న సంకల్పంతో ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నాం. నిరుపేదలకు అన్ని రకాలైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఒక్కోచోట 120 నుంచి 150 కోట్ల రూపాయల వ్యయంతో ఈ క్యాంపస్‌లకు శంకుస్థాపన చేస్తున్నాం. ఒక్కో రెసిడెన్షియల్ స్కూల్‌లో దాదాపు 2500 మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుకుని, భవిష్యత్తులో వారంతా ఉన్నతస్థాయికి ఎదగాలని, తద్వారా వారు దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం" అని సీఎం చెప్పారు. "నిరుపేదలను విద్యకు దూరం చేస్తే ఈ దేశ సంపదకే తీవ్ర నష్టం చేసిన వారమవుతాం. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో దాదాపు 5 వేల పాఠశాలలు మూసేశారు. తద్వారా ముఖ్యంగా దళితులు, గిరిజనులు విద్యకు దూరమయ్యే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయి. పేదల కోసం పనిచేసే అధికారులను తప్పనిసరిగా ప్రభుత్వం, ప్రజలు ఎప్పుడూ అభినందిస్తారు. విద్యా ప్రమాణాలను పెంచాలన్న లక్ష్యంతోనే సుదీర్ఘ కాలంగా ప్రమోషన్లు లేక ఆందోళన చెందుతున్న సందర్భంలో రాష్ట్రంలో 21 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు కల్పించడమే కాకుండా ఎక్కడా వివాదాలకు తావులేకుండా 34 వేల మంది టీచర్లను బదిలీలు చేశాం" అని సీఎం రేవంత్ అన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా ముఖ్యమంత్రి ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు."భగవంతుడు ప్రజలకు సుఖశాంతులు కలిగించాలి. పాడిపంటలు ఇవ్వాలని, పిల్లలకు మంచి చదువులు, ఉజ్వల భవిష్యత్తును ఇవ్వాలని ఆకాంక్షిస్తూ, ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు" అని అన్నారు.

టార్గెట్ కేసీఆర్:

పదేళ్లలో రూ.7 లక్షల కోట్లు అప్పు చేసిన కేసీఆర్ విద్యపై దృష్టి పెట్టలేదని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. పేదలు చదువుకుంటే బానిసలుగా ఉండరనేది కేసీఆర్ ఆలోచన అని మండిపడ్డారు. తాము 90 రోజుల్లోనే 30వేల మందికి ఉద్యోగాలిచ్చామన్న సీఎం రేవంత్ రెడ్డి.. పిల్లలకు విద్య, పేదలకు వైద్యం ఇవ్వడం తమ విధానం అన్నారు. చేపలు, గొర్రెలు, బర్రెలు ఇవ్వడం కేసీఆర్ విధానం అన్నారు.

# పిఠాపురం అభివృద్ధికి టాప్ గేర్ వేసిన పవన్ కళ్యాణ్!

మొదటి పేజి తరువాయి



**అమరావతి :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి తన శాఖల పరిధిలో కీలక మార్పుల దిశగా అడుగులు వేస్తూనే మరోవైపు తనకు ఎమ్మెల్యేగా డిప్యూటీ సీఎం గా మారడానికి అవకాశం ఇచ్చిన పిఠాపురం ఓటర్ల విషయంలో కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

పిఠాపురంలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందాలు

పిఠాపురం నియోజకవర్గ ప్రగతికి ఎప్పటికప్పుడు కీలక నిర్ణయాలను తీసుకుంటున్న పవన్ కళ్యాణ్ తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని నిర్ణయం తీసుకున్న పవన్ కళ్యాణ్ దీనిపై దృష్టి సారించి నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

వారికి పవన్ ఆదేశాలు

మొత్తం పిఠాపురం నియోజకవర్గంలో 52 గ్రామాలు, రెండు మునిసిపాలిటీలలో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలపై నివేదిక ఇవ్వాలని ఆ ప్రత్యేక బృందాలకు ఆదేశాలు జారీ చేశారు పవన్ కళ్యాణ్. అంతేకాదు పిఠాపురం నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం చేయవలసిన అభివృద్ధి పనుల గురించి సమగ్రంగా అధ్యయనం చేయాలని వారికి సూచించారు.

పవన్ రాజకీయ ప్రస్థానం ఇలా

ఏపీలో జనసేన పార్టీ స్థాపించి రాజకీయాలు మొదలుపెట్టిన పవన్ కళ్యాణ్ రాజకీయాలలో నిలదొక్కుకునేందుకు సుదీర్ఘ పోరాటమే చేశారు. తొలిసారి ఎన్నికలలో రెండు చోట్ల పోటీ చేసిన పవన్ కళ్యాణ్ గాజువాక, భీమవరం లలో పోటీ చేసి రెండు చోట్ల ఓటమిపాలయ్యారు. పవన్ కళ్యాణ్ మాత్రమే కాకుండా జనసేన పార్టీ నుంచి ఒకే ఒక ఎమ్మెల్యే మినహాయించి మిగతా ఎవరు గెలవలేదు.

పిఠాపురం నుండి పవన్ కు పట్టం

గెలిచిన ఎమ్మెల్యే కూడా పవన్ కళ్యాణ్ కు షాక్ ఇస్తూ వైసిపి భజన చేశారు.అయినప్పటికీ పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యల పట్ల పోరాటానికి తన వంతుగా ముందుకు వచ్చి ముందుకు సాగారు. దీంతో గత ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన పవన్ కళ్యాణ్ కు అత్యధిక మెజారిటీ ఇచ్చి ప్రజలు పట్టం కట్టారు.

పిఠాపురం ప్రజల కోసం పవన్ కీలక నిర్ణయం

ఒక్క పిఠాపురం నియోజకవర్గం లోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీ నుంచి పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ విజయకేతనం ఎగరవేశారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ గెలవడాన్ని ప్రతిష్టత్మకంగా భావించిన జనసేన అధినేత తనను ఓట్లేసి గెలిపించిన ప్రజలను మర్చిపోకుండా తన వంతుగా వారికి వెన్నుదన్నుగా నిలిచారు. ఈ క్రమంలోనే పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కీలక నిర్ణయం తీసుకున్నారు.

# రేవంత్ రెడ్డి స్వయంగా మూసీ ప్రాంతంలో పర్యటించి... కూల్చివేతలకు ఒప్పించాలి

మొదటి పేజి తరువాయి



**హైదరాబాద్ :** కూల్చివేతలు అంత ఈజీ కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మూసీ ప్రాంతంలో పర్యటించి ప్రజలను ఒప్పించాలని కేంద్రమంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి అన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో పేదల ఇళ్ల కూల్చివేత సరికాదన్నారు. ఇక్కడి పేదలకు బీజేపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇక్కడ నివసించే ప్రజలు ఎంతో కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టుకొని ఇళ్లను కొనుక్కున్నారని తెలిపారు. అలాంటి వాటిని కూల్చడమేమిటన్నారు. మూసీ రిటర్నింగ్ వాల్‌ను నిర్మించి కూడా సుందరీకరణ చేయవచ్చునన్నారు. అన్ని డ్రైనేజీలు మూసీలోనే కలుస్తాయని, కనీసం శుద్ధి జరగకుండా నేరుగా నదిలోనే మురుగునీరు కలుస్తోందన్నారు. తక్కువ ఖర్చుతోనే కేంద్ర ప్రభుత్వం గంగానదిని శుభ్రం చేస్తోందని వెల్లడించారు. మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు అవసరం లేదన్నారు. రేస్ కోర్స్ స్థలాన్ని అమ్మి మరీ సుందరీకరణ పనులు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఎలాంటి ప్లాన్ లేకుండా హైడ్రా పేరుతో కూల్చివేతలు సరికాదన్నారు. ముఖ్యమంత్రి దూకుడుగా వ్యవహరిస్తామంటే కుదరదని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలాగే ప్రజలను బెదిరింపులకు, భయాందోళనకు గురి చేసిందన్నారు. హైడ్రాకు గవర్నర్ చట్టబద్ధత కల్పించడం సాధారణ ప్రక్రియ అన్నారు. హైడ్రా బాధితులు ఆందోళన చెందవద్దన్నారు. మూసీ బాధితుల కోసం బీజేపీ పోరాటం చేస్తుందని హామీ ఇచ్చారు.

బస్ డిపో, మెట్రోను కూల్చాలని డిమాండ్

గతంలోనూ ప్రభుత్వాలు నిర్మాణాలను కూల్చివేశాయని, కానీ ఇప్పుడు పేరు మాత్రమే హైడ్రా అని మార్చారని కిషన్ రెడ్డి విమర్శించారు. చెరువులను, నాళాలను కాపాడేందుకే అని చెప్పే హైడ్రా మొదట మూసీ నదిలో ఉన్న బస్సు డిపోను, మెట్రో పిల్లర్స్‌ను, మెట్రో స్టేషన్‌ను కూల్చాలని డిమాండ్ చేశారు. వాటిని కూల్చకుండా పేదల ఇళ్లు ఎలా కూలుస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు ఎవరూ కూడా తనను సంప్రదించడం లేదని స్పష్టం చేశారు.

ఎన్నికల ఫలితాలపై స్పందించిన కిషన్ రెడ్డి

జమ్ము కశ్మీర్ ఎన్నికల ఫలితాలపై కిషన్ రెడ్డి స్పందించారు. ఆ రాష్ట్రంలోని 98 శాతం హిందువుల ఓట్లు తమకే వచ్చాయన్నారు. కశ్మీరీ పండిట్ల ఓట్లు బీజేపీకే పడ్డాయన్నారు. ఆర్టికల్ 370 రద్దు ఓ చరిత్ర, దానిని తిరిగి తీసుకువచ్చే అవకాశమే లేదన్నారు. ఘూర?ండ్ ఎన్నికల్లోనూ తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో పాక్ ఆటలు సాగవన్నారు.

# కియా షోరూమ్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి



టీసీఎస్, లులూ, రిలయన్స్ వంటి కంపెనీలు ప్రస్తుతం ఏపీ వైపు చూస్తున్నాయని ఆయన అన్నారు. దానికి కారణం మన బ్రాండ్ అంబాసిడర్, ఆయన పేరే నారా చంద్రబాబు నాయుడు అని లోకేశ్ పేర్కొన్నారు. ఎక్కడి వెళ్లినా చంద్రబాబు నాయుడి రాష్ట్రం అంటున్నారని, ఆయనపై ఉన్న విశ్వసనీయత, నమ్మకం వల్లే రాష్ట్రంలోకి తిరిగి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చే పరిస్థితి ఉందని తెలిపారు.

భారతదేశంలో ఎక్కడికి వెళ్లినా అక్కడ కనిపించే కియా కార్లు 'మేడిన్ ఆంధ్రప్రదేశ్' కావడం గర్వించదగ్గ విషయమని లోకేశ్ వివరించారు.

రాయలసీమలో తయారీ రంగ పరిశ్రమలు

రాజధాని ప్రాంతంలో ఉన్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు పెద్ద ఎత్తున ఇన్వెస్ట్‌మెంట్స్ వస్తాయని మంత్రి నారా లోకేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. సేవల రంగానికి చెందిన కంపెనీలను ఉత్తరాంధ్రకు తీసుకొస్తామని ఆయన అన్నారు. రాయలసీమలో తయారీ రంగ పరిశ్రమల నెలకొల్పుతామని అన్నారు. గోదావరి జిల్లాల్లో ఆక్వా, పెట్రో కెమికల్స్ సంస్థలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

జగన్ జిల్లాల పర్యటనకు అనుమతి ఇస్తాం

మాజీ సీఎం జగన్ జిల్లాల పర్యటనకు వెళితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం పర్మిషన్ ఇస్తామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. అయితే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక రెడ్‌బుక్‌లో పేరు ఉందంటూ వైసీపీ నాయకులు వణికిపోతున్నారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పాదయాత్ర సమయంలో చెప్పినట్టుగానే భూకబ్జాలకు పాల్పడిన వారిపై, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పకుండా తీసుకుంటామని అన్నారు. అలాంటి వారిని విడిచిపెట్టబోమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంపై నకిలీ వార్తలు ప్రచారం చేస్తున్నారని, ఫేక్ ప్రచారం చేసేవాళ్లపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని మంత్రి వార్నింగ్ ఇచ్చారు. ఫేక్ ప్రచారం చేసేవారిపై చర్యల విషయంలో ఎలాంటి అనుమానాలు అవసరంలేదని అన్నారు.

# జమిలికి చంద్రబాబు సై ఏపీలో ముందస్తు, జగన్ కు కలిసొచ్చేనా..!!

మొదటి పేజి తరువాయి



ఆ కమిటీ నివేదిక కూడా ఇచ్చింది. కొద్ది రోజుల క్రితం కేంద్రం ఆ రిపోర్టును ఆమోదించింది. శీతాకాల పార్లమెంట్ సమావేశా ల్లో జమిలికి సంబంధించిన బిల్లులను ఆమోదించేలా కార్యారణ సిద్దం అవుతోంది. ఇదే సమయం లో ఎన్డీఏ భాగస్వామ్య పక్ష నేత సీఎం చంద్రబాబు సైతం జమిలికి మద్దతు ప్రకటించారు. పార్లమెంట్ తో పాటుగా ఏపీ అసెంబ్లీకి ఎన్నికలు జరగటం ఖాయంగా కనిపిస్తోంది.

చంద్రబాబు సిద్దం

షెడ్యూల్ ప్రకారం 2029 మార్చి తరువాత ఏపీ అసెంబ్లీకి ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే, ఢిల్లీ ముఖ్య నేతల్లో జరుగుతున్న చర్చ మేరకు 2027 జూన్ నుంచి ఎప్పుడైనా జమిలి జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఏపీలోనూ ముందస్తు ఎన్నికలు ఖాయమనే అభిప్రాయం ఉంది. దీంతో..ఈ నిర్ణయానికి మద్దతు ప్రకటిస్తూనే.. ఆ దిశగానే పాలనా పరంగా. రాజకీయంగా చంద్రబాబు నిర్ణయాలు అమలు చేసేలా సిద్దపడుతున్నట్లు తెలుస్తోంది. కేంద్రం తీసుకొచే బిల్లుల ద్వారా సాంకేతిక సమస్యలను సైతం అధిగమించి జమిలి నిర్వహణకు మోదీ ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. దీంతో, ఏపీలోనూ 2027 లోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉందనే చర్చ బలంగా వినిపిస్తోంది.

కలిసొచ్చేదెవరికి

అదే జరిగితే ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై మూడేళ్లు మాత్రమే పూర్తవుతుంది. దీంతో.. తమ హామీల అమలు..రాజధాని...పోలవరం చంద్రబాబుకు ప్రధాన అంశాలుగా మారనున్నాయి. జమిలి ఖాయమని భావిస్తున్న వేళ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఇదే మూడు పార్టీల కూటమిగా కొనసాగుతారా అనేది కీలక అంశం. మరో వైపు మాజీ సీఎం జగన్ తిరిగి తమకు అధికారం దక్కటం ఖాయమనే ఇప్పటికే చెబుతున్నారు. పార్టీ ప్రక్షాళన నిర్ణయాలు తీసుకుంటూనే..కూటమి ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నారు. దీంతో.. ప్రచారం సాగుతున్నట్లుగా 2027లోనే ఎన్నికలు వస్తే ఎవరికి కలిసి వస్తుందనేది ఇప్పుడు కీలక చర్చగా మారుతోంది.

# పవన్ కల్యాణ్ పేరు చెప్పి ఏకంగా దందాలు, డీఎఫ్ వోకు పగిలింది



**అమరావతి :** తన పేరు చెప్పుకుని ఎవరినైనా బెదిరించినా, తన పేరు దుర్వినియోగం చేసినా పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. అటవీ శాఖలో ఉన్న అధికారుల పేర్లు, తన పేరు చెప్పుకొని మైనింగ్ వ్యాపారులను, కింది స్థాయి అధికారులను బెదిరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. ఇదే సమయంలో కాకినాడ డీఎఫ్ వో రవీంద్రనాథ్ రెడ్డి పై విచారణ జరిపి ఆయన మీద చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. కాకినాడ డీఎఫ్ వో రవీంద్రనాథ్ రెడ్డి పై విచారణకు పవన్ కళ్యాణ్ ఆదేశాల జారీ చేయడంతో ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖలో హాట్ టాపిక్ అయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇటీవలే రవీంద్రనాథ్ రెడ్డి కాకినాడ డీఎఫ్ వోగా బాధ్యతలు స్వీకరించారు. కాకినాడీ అటవి శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మైనింగ్ వాహనాల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకున్న రవీంద్రనాథ్ రెడ్డి కొందరు మైనింగ్ వ్యాపారులకు ఫోన్లు చేసి బెదిరించారని ఆరోపణలు ఉన్నాయి. కాకినాడ అటవీ శాఖలో తాను చెప్పిందే వేదమని, తన మాటకు ఎదురు చెబితే పరిస్థితులు వేరుగా ఉంటాయని డీఎఫ్ వో రవీంద్రనాథ్ రెడ్డి కొందరు మైనింగ్ వ్యాపారులను, అటవి శాఖలోని కొందరు అధికారులకు ఫోన్లు చేసి బెదిరించారని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వరకు వెళ్లింది. డీసీఎం పవన్ కళ్యాణ్ పేరు అడ్డం పెట్టుకుని, అటవీ శాఖలోని సీనియర్ అధికారుల పేర్లు చెబుతున్న డీఎఫ్ వో రవీంద్రనాథ్ రెడ్డి పలువురిని బెదిరించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డీఎఫ్ వో రవీంద్రనాథ్ రెడ్డి విషయంలో సీరియస్ అయ్యారని, ఆయనపై విచారణకు ఆదేశాలు జారీ చేయడం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీసింది. తన పేరు చెప్పుకొని అటవీశాఖ లో ఎవరినైనా బెదిరించినా, తన పేరు దుర్వినియోగం చేసినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హెచ్చరించారు.

# రాంపురం పాకాల ఏటి పై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలి

## సీఎంముఖ్య కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన సలహాదారులకు వినతి పత్రం అందజేత





గార్ల (గౌతమ్ న్యూస్): మండల పరిధిలోని రాంపురం పాకాల ఏటి పై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కు పి-బి డిపార్ట్మెంట్ నుండి నిధులు మంజూరు చేసి పై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని సీఎం ముఖ్య కార్యదర్శి , ఐపీఎస్ వి.శేషాద్రి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిని హైదరాబాదులో కార్యాలయంలో ఇల్లందు ఎమ్మెల్యే గౌరవనీయులు కోరం కనకయ్య, గార్ల పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ లు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాలను సమర్పించారు. దీంతో వారు సానుకూలంగా స్పందించి త్వరలో పాకాల ఏటి పై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపినట్లు పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ తెలిపారు.



# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ వారి కార్యాలయం





పోలవరం (గౌతమ్ న్యూస్): జంగారెడ్డిగూడెం మండలం జంగారెడ్డిగూడెంలో జె పి ఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు గారు వారి వెంట చింతలపూడి మరియు పోలవరం నియోజకవర్గం లోని నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# నాగర్ కర్నూల్ లో మనిషాసుర మర్ధినిగా వాసవి మాత!!



నాగర్ కర్నూల్, వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): మహిషాసుర మర్దిని గా వాసవి మాత.... దర్శనమిచ్చారు నాగర్ కర్నూల్.... జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం నాడు వాసవి కన్యకా పరమేశ్వరి మహిషాసుర మర్దిని రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు ఈ సందర్భంగా విశేష పూజలు సామూహిక పూజ కుంకుమార్చన మహా నీరాజనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షులు పలువురిని సన్మానించారు ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు

# దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎస్సై



గంభీరావుపేట,(గౌతమ్ న్యూస్): ప్రశాంత వాతావరణంలో దసరా పండుగ నిర్వహించుకోవాలని, తాగి ప్రమాదాలకు గురికా వద్దంటూ ఎస్సై శివకుమార్ అన్నారు. అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దసరా సందర్భంగా ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపిన, లైసెన్సు లేకుండా వాహనం నడిపిన చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్సు లేని వారికి వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. దుర్గదేవి నిమజ్జనాలలో డీజీలకు అనుమతి లేదని, ఒకవేళ డీజే పెట్టినట్లయితే నిర్వాహకులపై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మండల ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# సగర సంఘానికి సంపూర్ణ సహకారం అందిస్తా

## నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేఎమ్మెల్యే డాక్టర్ కూచకుల్లా రాజేష్ రెడ్డి

## ఎమ్మెల్యేను సన్మానించిన సగర సంఘం జిల్లా నూతన కార్యవర్గం



నాగర్ కర్నూల్, వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): సగర సంఘానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఏర్పాటైన సగర సంఘం నూతన కార్యవర్గం సభ్యులు జిల్లా అధ్యక్షుడు పి. గట్టు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సగర సంఘానికి అవసరమైన తోడ్పాటును అందిస్తానని హామీ ఇచ్చారు. తాపీ మేస్త్రీలు ఇతర కార్మిక రంగంలో స్థిరపడిన వారందరికీ ప్రభుత్వపరంగా పథకాలు అందించడమే కాకుండా వారి అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పాటుపడుతుందన్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సగర సంఘం బాధ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.గట్టు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల సుధాకర్, కోశాధికారి పడకంటి రాజు, పట్టణ సగర సంగమ అధ్యక్షుడు కొమ్ముల బాలయ్య, జిల్లా మేస్త్రీల సంఘం అధ్యక్షుడు అల్లం రాముడు, సలహాదారులు కొమ్ముల జానకి రాములు మేస్త్రి, కొమ్ముల శ్రీనివాసులు మేస్త్రి తదితరులు పాల్గొన్నారు,

# సొసైటీలో రుణాలు పంపిణీ

టేకులపల్లి (గౌతమ్ న్యూస్): టేకులపల్లి మండలం బేతంపూడి సొసైటీలో శుక్రవారం రైతులకు రుణాలను పిఎసిఎస్ అధ్యక్షుడు లక్కినేని సురేందర్ రావు పంపిణీ చేశారు. 1881 మంది రైతులకు రూ.6.30 కోట్లు రుణమాఫీ కింద పంపిణీ చేయగా, 1415 మంది రైతులకు రూ.5.31 కోట్లు డెబిట్ వేవర్ లోన్ అందజేశారు. 250 మంది రైతులకు 1.22 కోట్లు పాత రుణాల మీద పెంచి ఇచ్చారు. ఈ రుణాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని సురేందర్ కోరారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి పొన్నోజు ప్రేమాచారి, తగలుపు కార్యదర్శి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు ఉదయ్, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

# జమ్మి చెట్టు పూజ, పాలపిట్ట దర్శనం

## గార్లలో జాతీయ జెండా ఆవిష్కరణ కవి, రచయిత వజ్రం.

గార్ల(గౌతమ్ న్యూస్): దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చెడు పైన మంచి గెలుపుకు చిహ్నం విజయ దశమిగా పరిగణిస్తారు. విజయదశమి రోజు ప్రారంభించిన కార్యాలన్ని సిద్ధిస్తాయనే ప్రజల విశ్వాసంతో కూడిన నమ్మకం, దసరా.. పది జన్మల పాపాలను నశింప చేస్తుందని అర్థం.. దీనిని సంస్కృతంలో "దశహర"అని పిలుస్తారు. సీతాదేవి అపహరణ తదుపరి లోక కంఠకున్ని, శ్రీరామచంద్రుడు యుద్ధంలో



ఓడించి పది శిరస్సుల ఛేదన సందర్భంగా దీనిని "దసరా"గాను, లేదా విజయదశమిగా నిర్వహించుకుంటారు.

### శమీ పూజ.. జైత్రయాత్ర

శ్రీరామచంద్రుడు విజయదశమి రోజు శమీ పూజ చేసి లంకపై జైత్రయాత్ర ప్రారంభించడంతో ఇది "విజయ దశమి" అయింది. శరన్నవరాత్రులు.. జగన్మాతను ఒక్కొక్క రోజు ఒక్కొక్క రూపంలో ఆరాధిస్తారు, తదుపరి వచ్చే శరదృతువులో మహోత్సవం వస్తుంది. పరాశక్తి తొమ్మిది రూపాయలలో పూజింపబడుతుంది, కన్య నుంచి




దుర్గ, సుభద్ర గా, తొమ్మిది రోజులు కొలుస్తారు. ఒక బిడ్డ పుట్టే క్రమంలో తొమ్మిది నెలలు పూర్తి కావాలి, 9 సంఖ్య బిడ్డ పుట్టుకను సూచించును. అందుకే బతుకమ్మను 9 రోజులు కొలిచారు. జమ్మి చెట్టు.. పూజ, ప్రదక్షిణలు, దసరా రోజున జమ్మి చెట్టు ప్రదక్షిణలు చేసి పూజలు చేయడం ఆనవాయితీ, పురాణ కథనం ప్రకారం పాండవులు వనవాసం సమయములో వారి ఆయుధాలను జమ్మి చెట్టుపై భద్రపరిచారని ఇతిహాసం. శ్రీరామచంద్రుడు శమీ పూజ చేసి లంకపై జైత్రయాత్ర ప్రారంభించారు. జమ్మి చెట్టును సంస్కృతంలో శమీ, శివా, మాంగళ్య, లక్ష్మి సుభద్ర పవిత్ర సురభి అని పేర్లు ఉన్నాయి. శమీ వృక్షం అగ్ని క్రాంతికి ప్రతీక, ఏ నామముతో పిలిచిన ఇవి అన్నియు శుభకరమైనవి. ఆయుర్వేద పరంగా జమ్ము చెట్టులోని వివిధ భాగాలు ఔషధంగా వినియోగపడతాయి. దీంతో ఈ చెట్టుకు "బంగారం"సురభి అనే పేరు వచ్చింది.

### అలాయ్... బలాయ్

అలాయ్-బలాయ్. దసరా పండుగ రోజు పిల్లలు పెద్దలు జమ్మి ఆకులను బంగారం అంటూ ఒకరికి ఒకరు ఇచ్చిపుచ్చుకుంటారు. శమీ ఆకులను సమయస్కులకు అందజేసి హత్తుకుంటారు. సౌభ్రాతత్వపు ఆలోచనలు నెలకొల్పాలని ఉద్దేశం. పాలపిట్ట దర్శనం ప్రత్యేకం. జమ్మి చెట్టు షమీ పూజ అనంతరం పాలపిట్టను చూస్తే విజయానికి అడ్డంకులు ఉండవని భావిస్తారు. ఈ సాంప్రదాయం ఆనవాయితీగా వస్తుంది. నవ అనుగ్రహాలు కలగడానికి దోషాలు తొలగిపోవడానికి ఇలా చేస్తారు.

### గార్లలో దసరా రోజు జాతీయ జెండా ఆవిష్కరణ..

మైసూర్ ప్యాలెస్ లో దసరా ఉత్సవాలకు పెట్టింది పేరు. ఏనుగులపై అంబారీలతో ఊరేగింపు చేస్తారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో ప్రత్యేక దుస్తులు అలంకరించి "దాండియా"ఆటలు



ఆడుతారు. దసరా పర్వాన గార్లలో జాతీయ జెండా ఆవిష్కరణ... దసరా పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక పట్టణ కేంద్రం సీతంపేట రూట్ లో గల ప్రత్యేకంగా నిలకొల్పిన దిమ్మె పై నైజం కాలం నుంచి వస్తున్న ఆచారంలో భాగంగా మతసామరస్యానికి, దేశభక్తికి చిహ్నంగా స్థానిక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, లేదా ఇంచార్జ్ బాధ్యుల చేత జాతీయ జెండా ఆవిష్కరించటం ఆనవాయువుగా వస్తుంది. దేశంలో ఎక్కడా లేని విధంగా విజయదశమి రోజు జాతీయ జెండాను ఆవిష్కరించటం ఆనందదాయకం.

# పాలపిట్ట ,రావణ దహనం, శమీ పూజ పండుగ ప్రత్యేకత!!

నాగర్ కర్నూల్, వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): హిందువులలో అతి పెద్ద పండుగ అయిన విజయదశమి ఆశ్వీజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వీజ శుద్ధ 9 రోజులు దేవీ నవరాత్రులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించి పదవరోజు విజయదశమి కలసి దసరా పండుగ జరుపుకుంటారు, ఇది ముఖ్యంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ ఈ పండుగను నవరాత్రి శరన్నవరాత్రి



అంటారు, శరదృతం ఆరంభంలో వచ్చే పండుగ కావున ఈ పేరు వచ్చింది, అమ్మవారికి తొమ్మిది రోజులపాటు నవరాత్రుల సందర్భంగా ఒక్కొక్క రోజు ఒక విధంగా వివిధ రూపాలలో అలంకరించి భక్తిశ్రద్ధల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు, తెలంగాణ రాష్ట్రంలోని పల్లెలలో మహిళలు ఈ పండుగకు పట్టు పీతంబరాలు ధరించి ప్రతి ఒక్కరు కూడా ఉత్త దుస్తులు కొనుగోలు చేసి పండుగను అత్యంత వైభవంగా జరుపుకోవడం విశేషం, ఈ పండుగ చరిత్ర విషయానికి వస్తే రాముడు రాముని పై గెలిచిన సందర్భంగా పాండవులు వనవాసం వెళ్తూ జమ్మి చెట్టుపై తమ

# దుర్గాదేవి విజయమే విజయదశమి!!



ఆయుధాలను తిరిగి తీసిన రోజు ఈ సందర్భంగా రామన్నవద జమ్మి చెట్టు దగ్గర చెట్టుకు ఆకుల పూజ చేయడం జరుగుతుంది, దుర్గాదేవి మనిషాసురుడి రాక్షసుడునిలో తొమ్మిది రాత్రులు యుద్ధం చేసి అతన్ని వధించి విజయం సాధించిన సందర్భంగా 10వ రోజు విజయదశమిని విజయం సాధించిన సందర్భంగా ఈ పండుగను జరుపుకుంటారు, ఈ పండుగ రెండు తెలుగు రాష్ట్రాలలో ఘనంగా హిందువులు పవిత్రంగా జరుపుకునే పండుగ, తెలంగాణలో అతిపెద్ద పండుగగా దసరా విజయదశమి రోజు గ్రామాలలో పట్టణాలలో ప్రజలు కొత్త దుస్తులు ధరించి ఊరేగింపుగా బయలుదేరి గ్రామ శివారులో గల జమ్మి చెట్టు శమీ పూజను నిర్వహిస్తారు అంతేకాక ఈ దసరా పండుగ రోజు సెమీ పూజతో పాటు రావణ దహనం పాలపిట్టను దర్శించుకోవడం ఆనవాతిగా ఎన్నో సంవత్సరంలోకి



వస్తుంది, గ్రామాలలో వ్యవసాయ పొలాలలో చెరువు , కొండగుట్టలు, లో పాలపిట్ట పసుపు నీలం రంగుతో కూడిన పాలపిట్టను ప్రజలు దర్శించుకోవడానికి పోటీ పడుతుంటారు ఈ పాలపిట్టను దర్శించుకోవడం వల్ల శుభం కలుగుతుందని భావనతో ప్రజలు పాలపిట్టను దర్శించుకుంటారు, సాయంత్రం జమ్మి చెట్టు దగ్గర పూజలు నిర్వహించిన అనంతరం జమ్మి ఆకులను ఇంటి పెద్దలకు బంధువులకు బంధుమిత్రులకు ఒకరికి ఒకరు జమ్మి ఆకులతో శుభాకాంక్షలు తెలుపుకోవడం పాదాభివందనాలకు నమస్కారాలు చేయడం హిందూ సాంప్రదాయంలో ఎన్నో ఏళ్ల నుంచి ప్రక్రియ కొనసాగుతుంది, మొత్తం మీద ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులకు గురవుతున్న పేద ప్రజలు రైతులు రైతు కూలీలు ఈ పండుగకు దూరమవుతున్నట్టు తెలుస్తుంది,

# దసరా పండుగకు తెలుగు ప్రజలు సిద్ధం!!

## దసరా పండుగ రైతులకు దూరం!!

## తీపికి నోచుకోని రైతులు కూలీలు!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో దసరా పండుగకు ఒకపక్క ప్రజలు సిద్ధమవుతున్నప్పటికీ రైతులు రైతు కూలీలు రేకాడితే గాని డొక్కాడని దినసరి కూలీలు పేద అడుగు బలహీన వర్గాల ప్రజలు దసరా పండుగ తీపికి నోచుకోలేకపోతున్నారు, పెరుగుతున్న ధరలకు తట్టుకోలేక పేద ప్రజలు తల్లడిల్లి పోతున్నారు, మార్కెట్లో కూరగాయల ధరలతో పాటు కిరాణా షాపుల్లో నిత్యవసర వస్తువులు తీపి పదార్థాలు చేసుకోవడానికి ముందుకు రావడం లేదు, గత కొన్ని నెలల నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అసమర్ద వల్ల కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకిపోయాయి, కిలో టమాట ధర 80 రూపాయలు పలుకుతుంది,



కిలో ఉల్లిగడ్డ 50 నుంచి 60 రూపాయల వరకు విక్రయిస్తున్నారు, అదేవిధంగా పచ్చిమిర్చి కిలో వంద రూపాయలు చొప్పున అమ్ముతున్నారు, కూరగాయల ధరలతో పాటు కిరాణా షాపుల్లో తీపి పదార్థాలకు ఉపయోగించే బెల్లం, చక్కెర, వంటనూనె ధరలు విపరీతంగా పెరగడంతో కిలో వంటనూనె ధర 170 రూపాయలు ధర పలుకుతుంది, ఇటీవల కేంద్ర ప్రభుత్వం జరిగిన చమురు ధరల వల్ల వంటనూనెలలో భారీ మొత్తంలో పెంచింది, వీటితో పాటు పప్పు ఉప్పు కందిపప్పు ధర కూడా కేజీ 200 అమ్ముతున్నారు, ఈ విధంగా ధరలు పెరగడం వల్ల కాయా కష్టం చేసుకుంటున్న గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేదలు పండుగకు దూరమైపోతున్నారు, ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన ప్రజా సమస్యలు పట్టించుకునే నాథుడు లేదు, ఇటీవల నూతనంగా రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం దసరా పండుగకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయకుండా కనీసం ఒక మహిళకు 1000 రూపాయలు ఆర్థిక సాయం చేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది, రైతు భరోసా రుణమాఫీ సకాలంలో చేయకపోవడం వల్ల రైతులు రైతు కూలీలు దసరా పండుగకు దగ్గర కాలేకపోతున్నారు, ప్రజా సమస్యలను పరిష్కరించవలసిన ప్రభుత్వాలు పండుగలు వస్తే ప్రజలను ఎందుకు గుర్తుపెట్టుకోవడం లేదని ప్రశ్నలు వస్తున్నాయి, ప్రతి పండుగకు రేషన్ కార్డు కలిగిన ప్రతి మహిళకు కనీసం వెయ్యి రూపాయలు ప్రభుత్వం ఇవ్వాలని రేషన్ షాపుల్లో సన్న బియ్యంతో పాటు పప్పు ,ఉప్పు ,చింతపండు, నూనె ప్యాకెట్ బెల్లం వంటి సరుకులను సరఫరా చేయాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు, అధికారంలోకి రావడానికి అనేక అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని గాలికి వదిలిపెట్టిన ప్రభుత్వాలకు ప్రజలు తిరిగి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి ఇంటికి పంపిస్తారని విషయం తెలిసి కూడా ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వానాకాలం పంట పూర్తయి యాసంగి పంట ప్రారంభమగుతున్నప్పటికీ రైతు భరోసానిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడం పట్ల రైతులు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ప్రతి మహిళా అకౌంట్లో వెయ్యి రూపాయల చొప్పున పండుగ సహాయం అందించాలని ప్రతి మహిళకు నాణ్యమైన చీరలను పంపిణీ చేయాలని మహిళలు కోరుతున్నారు, పెరిగిన ధరలను వెంటనే అరికట్టాలని సామాన్య ప్రజలకు అందుబాటులో ధరలు ఉండే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేయాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు, ఇదేవిధంగా నిర్లక్ష్యం వహిస్తే ప్రజల నుంచి ఎదురు దెబ్బ తగలక తప్పదని ప్రజలు హెచ్చరిస్తున్నారు,

# రష్యా- ఇరాన్ అధ్యక్షుల భేటీ..! ఉత్కంఠ రేపుతున్న సమావేశం!



పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ ఇరాన్-రష్యా అధ్యక్షుల సమావేశం ఆసక్తి రేపుతోంది. హిజ్బుల్లా లక్ష్యంగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకరదాడులు కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ శుక్రవారం భేటీ అయ్యారు. ఇరువురు నేతలు తుర్క్‌మెనిస్థాన్ రాజధాని ఆష్గాబత్‌లో సమావేశం అయ్యారు. ఈ మేరకు రష్యా మీడియా వెల్లడించింది. ఇద్దరి భేటీలో ద్వైపాక్షిక అంశాలు, పశ్చిమాసియాలో అస్థిర పరిస్థితులపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని ఇరాన్‌కు చెందిన వార్తా సంస్థలు వెల్లడించాయి. ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో రష్యా నుంచి ఇరాన్ సైనిక పరమైన అంశాలు చర్చకు రానున్నట్లు తెలుస్తోంది. రష్యాకు చెందిన ఎస్‌యూ-35 యుద్ధవిమానాలు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థ ఎస్- 400 వంటి వాటిని ఇరాన్ కోరుతున్నట్లు పలు కథనాలు పేర్కొన్నాయి. ఇటీవల రష్యా విదేశాంగ మంత్రి ఇరాన్‌లో పర్యటించారు. ఇరాన్‌తో తమ మైత్రిని కొనసాగిస్తామని చెప్పారు. ఇదిలా ఉంటే ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేసేందుకు సిద్ధమవుతోంది. ఇరాన్‌లోని చమురు, అణు కేంద్రాల లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేయొచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్-రష్యా అధ్యక్షుల సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.

## మంత్రి పదవి నుంచి 'కొండా'ను తప్పిస్తారా? పీసీసీ చీఫ్ క్లారిటీ

హైదరాబాద్,: ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) పార్టీతో స్నేహం వేరు.. శాంతిభద్రతలు వేరని తెలంగాణ కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆయన కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్‌పై దాడి విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఆయన శుక్రవారం మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడారు. ''దాడుల విషయంలో కఠినంగా ఉంటాం. పార్టీలో నేతల చేరికలు జరిగిన చోట కొంత ఇబ్బంది అవుతుంది. అందుకే చేరికలకు బ్రేక్ వేశాం. దసరాకు రెండో విడత కార్పోరేషన్ పదవులు అనుకున్నాం. కానీ కుదరలేదు. దీపావళి లోపు పూర్తి చేస్తాం. త్వరలోనే జిల్లా పర్యటనకు వెళ్తాను భావితరాల భవిష్యత్ కోసమే హైడ్రా, మూసీ అభివృద్ధి. మూసీ అభివృద్ధికి రు. లక్షా యాభై వేల కోట్లని ఎక్కడా మేం చెప్పలేదు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో వందేళ్ల దోపిడీ జరిగింది. ఏఐసీసీ నేతలంత బిజీబిజీగా ఉండడం వల్లే మంత్రివర్గం, పీసీసీ కార్యావర్గం ఆలస్యం అయింది. త్వరలోనే రెండు భర్తీ చేస్తాం. మంత్రి కొండా సురేఖ ఇటీవల తన వాఖ్యలు వెనక్కి తీసుకున్నారు. ఆరోజే ఆ వ్యవహారం క్లోజ్ అయింది. మంత్రి వర్గం నుంచి కొండా సురేఖను తప్పిస్తారని ప్రత్యర్థులు చేస్తున్నది ప్రచారం మాత్రమే. వాస్తవం కాదు. ఈ విషయంపై అధిష్టానం ఎటువంటి వివరణ అడగలేదు'' అని అన్నారు.ు

## ఎన్నికల తర్వాత ఆ పార్టీకి మద్దతు ప్రకటించిన 'ఆప్'

**న్యూఢిల్లీ,:** తాజాగా జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఇందులో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమికి 48 సీట్లు వచ్చాయి. బీజేపీకి 29 సీట్లు వచ్చాయి. జమ్మూ కాశ్మీర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ ఒక సీటు గెలుచుకుంది. దోడా అసెంబ్లీ స్థానం నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి మెహ్రాజ్ మాలిక్ విజయం సాధించారు. ఫలితాల తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ కి మద్దతు ఇవ్వాలని నిర్ణయించింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్సీపీకి మద్దతు తెలుపుతూ లెఫ్టినెంట్ గవర్నర్‌కు లేఖ సమర్పించింది. దోడా అసెంబ్లీ స్థానం నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి మెహ్రాజ్ మాలిక్ 4,538 ఓట్లతో విజయం సాధించారు. ఆయనకు మొత్తం 23,228 ఓట్లు వచ్చాయి. భారతీయ జనతా పార్టీకి చెందిన గజయ్ సింగ్ రాణాపై మెహ్రాజ్ మాలిక్ విజయం సాధించారు. బీజేపీకి చెందిన గజయ్ సింగ్ రాణాకు 18,690 ఓట్లు వచ్చాయి. జమ్మూకశ్మీర్‌లో పదేళ్ల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్సీ-కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. నేషనల్ కాన్ఫరెన్స్‌కు 42, కాంగ్రెస్‌కు 6 సీట్లు వచ్చాయి. కాగా భారతీయ జనతా పార్టీ 29 స్థానాలు, పీడీపీ 3 స్థానాలు గెలుచుకున్నాయి. ఏడు స్థానాలు స్వతంత్ర అభ్యర్థులకు దక్కాయి. ఆమ్ ఆద్మీ పార్టీకి, జేపీసీకి ఒక్కో సీటు దక్కింది. గురువారం జరిగిన సమావేశంలో నేషనల్ కాన్ఫరెన్స్ ఎమ్మెల్యేలు ఒమర్ అబ్దుల్లాను తమ నేతగా ఎన్నుకున్నారు. శాసనసభా పక్ష నేతగా ఎన్నికైన అనంతరం ఒమర్ అబ్దుల్లా ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. నాపై విశ్వాసం వ్యక్తం చేసి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించిన పార్టీ ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ కంటే ముందు ఏడుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలలో నలుగురు కూడా నేషనల్ కాన్ఫరెన్స్‌కు మద్దతు ఇచ్చారు. కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత ఎంపిక కోసం శుక్రవారం సమావేశం కానుంది. సమావేశంలో ఎంపిక చేసిన నేత పేరును పార్టీ హైకమాండ్ ఆమోదం కోసం పంపనున్నారు. పదేళ్ల తర్వాత జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. రాష్ట్రంలోని 90 స్థానాలకు మూడు దశల్లో ఎన్నికలు జరిగాయి. మొదటి దశకు సెప్టెంబర్ 18న, రెండో దశకు సెప్టెంబర్ 25న, చివరి దశకు అక్టోబర్ 1న పోలింగ్ జరిగింది. అక్టోబర్ 8న జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి.

## యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యం లో 351వ రోజు అన్నదాన కార్యక్రమం




వరంగల్ (గౌతమ్ న్యూస్): యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో రాంనగర్ , హనుమకొండ జిల్లాకు చెందిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో సిటీ గార్డు లో పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న " చిలుక పార్థ సారథి " పుట్టినరోజు సందర్భంగా చిలుక పార్థ సారథి - అనూష రాణి దంపతుల సహకారంతో స్వయంకృషి మహిళా సొసైటీ వృద్ధాశ్రమం ములుగు రోడ్డు , హనుమకొండ లో ఉన్న వృద్ధులకు 351వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చిలుక పార్థ సారథి - అనూష రాణి , చిలుక చార్విక సారథి , బొట్టు వేణు , ముస్కు కిరణ్ , గుండేటి రాంబాబు , యం బెల్సన్ , అంతడుపుల వేణు , చిలువేరు మహేందర్ యాదవ్ , చెవిటి సురేష్ , ఆకుల నాగరాజు , ఎర్ర సురేష్ , రాయపురం రంజిత్ , పెరుమండ్ల నరేష్ , గుగులోత్ సంతోష్ , ఆడేపు నరేష్ , దొంతి నాగేంద్ర , యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) , కానిస్టేబుల్ బొట్టు కమలాకర్ , కోలా రాజేష్ , ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ , అలువల పృథ్వి , ఉప్పరపల్లి రాజ్ కుమార్ , మునిగాల రాంప్రసాద్ , సృజన , జ్యోతి , భావన , బిటుకూరి యాకయ్య , పాలకుర్తి విష్ణు , ఎస్.కె ముస్తఫా , లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ ( హైకోర్ట్ అడ్వకేట్ ) , ఊరటి రవికుమార్ , యాద రవికుమార్ , చెలిమల్ల అశోక్ కుమార్ , తూనం రాము , సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్ , మోడెం రాజశేఖర్ గౌడ్ , నాగవెల్లి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మరాయుడు యువజన సంఘం అధ్యక్షునిగా మేడి సతీష్





ఖానాపురం (గౌతమ్ న్యూస్): ఖానాపురం మండలం ధర్మారావు పేట లోని బాలుతాండలో ధర్మరాయుడు యువజన సంఘం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ధర్మరాయుడు యువజన సంఘం అధ్యక్షులుగా మేడి సతీష్ , ప్రధాన కార్యదర్శి గా కదిరే రాము ను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీ కోసం యువజన సంఘం తరపున గ్రామనికి సహాయ సహకారాలు అందిస్తామని అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా కదిరే రజినీకాంత్,సహాయ కార్యదర్శిగా మేడి రాకేశ్,కోశాధికారిగా మేడి వీరస్వామి ముఖ్య కమిటీ సభ్యులుగా కదిరే లక్ష్మణ్ , మేడి రాజేష్,కదిరే కరుణాకర్,పెండ్లి నాగరాజు,తోటకూరి రాజు,మామిడాల రాజు,మేడి శ్రీను, మేడి రామరాజు,పెండ్లి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకటే చట్టం... ఒకటే మాడ్యూల్

### రాష్ట్రంలోని 124 చట్టాలను కలిపి రెవెన్యూ కోడ్ అమలు

### ఇప్పటికే సిద్ధమవుతున్న ముసాయిదా.. త్వరలోనే ప్రభుత్వ పరిశీలనకు..

### ప్రస్తుతం ఉన్న 20కిపైగా కాలంచెల్లిన రెవెన్యూ చట్టాలను రద్దు చేసే అవకాశం




హైదరాబాద్: ధరణి పోర్టల్‌లోని అన్ని మాడ్యూళ్లను రద్దు చేసి ఒకటే మాడ్యూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న అన్ని రెవెన్యూ చట్టాల స్థానంలో ఒకటే చట్టాన్ని (రెవెన్యూ కోడ్) అమల్లోకి తెచ్చేందుకు కూడా కసరత్తు చేస్తోంది. ధరణి పోర్టల్ పునర్మిర్మాణ కమిటీతోపాటు గతంలో నల్సార్ విశ్వవిద్యాలయం చేసిన సిఫార్సు మేరకు రెవెన్యూ కోడ్‌ను అమలు చేసే దిశగా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ఈ కోడ్ ముసాయిదా తయారీలో నిమగ్నమైన రెవెన్యూ వర్గాలు త్వరలోనే ముసాయిదా చట్టాన్ని ప్రభుత్వ పరిశీలనకు పంపనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 124 రెవెన్యూ చట్టాలు, నియమాలు అమల్లో ఉన్నాయి. రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)తోపాటు సర్వే, భూ రికార్డుల నిర్వహణ, సీలింగ్, కౌలు, రెవెన్యూ రికవరీ, భూ ఆక్రమణ నిరోధం, రెవెన్యూ పరిపాలన, భూదాన్, ఇనాం, వదిలివేయబడిన భూములు, భూవివాదాల పరిష్కారం... ఇలా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమల్లో ఉన్న అన్ని చట్టాలు ప్రస్తుతం కూడా అమల్లో ఉన్నాయి. అయితే వాటన్నింటినీ తెలంగాణకు వర్తింపజేయాల్సిన అవసరం లేదని.. వాటిలో 20కిపైగా కాలంచెల్లిన చట్టాలున్నా యని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో భూచట్టాల నిపుణులు పేర్కొన్నారు. కానీ ప్రభు త్వం దీన్ని పెడచెవిన పెట్టింది. కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పాటయ్యాక రెవెన్యూ వ్యవస్థ అమల్లో గందరగోళాన్ని నివారించేందుకు ఒకటే రెవెన్యూ చట్టాన్ని అమల్లోకి తేవాలనే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కాలంచెల్లిన ఆ చట్టాలను రద్దు చేయడంతోపాటు అన్ని రాష్ట్రాల్లో అమల్లో ఉన్న 5 వేల భూ చట్టాలను అధ్యయనం చేసి అందులో అవసరమైన చట్టాలను తెలంగాణకు వర్తింపజేస్తూ రెవెన్యూ కోడ్‌లో పొందుపరిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### అధికారులకూ సులభతరం...

నిజాం హయాంలో తెలంగాణ ప్రాంత భూపరిపాలన, రెవెన్యూ వ్యవస్థ అమలు కోసం భూమి రెవెన్యూ చట్టం-1907 పేరుతో సమగ్ర చట్టం అమల్లో ఉండేది. తెలంగాణ ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో కలిశాక ఈ చట్టం స్ఫూర్తిని నిర్వీర్యం చేస్తూ 124 చట్టాలుగా మార్చారని భూచట్టాల నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు రెవెన్యూ కోడ్ అమల్లోకి వస్తే భూమి సమస్యల పరిష్కారం సంబంధిత అధికారులకు సులభతరం కావడంతోపాటు భూమి హక్కులను కాపాడుకునే విషయంలో రైతులకు కూడా స్పష్టత వస్తుందని అంటున్నారు. ఏ చట్టం ద్వారా ఏ సమస్య పరిష్కారమవుతుంది, ఏ అధికారి వద్దకు వెళ్లాలనే విషయంలో కూడా అన్నదాతలకు గందరగోళం పోతుందని చెబుతున్నారు. యూపీలో 2016లోనే ఈ కోడ్ అమల్లోకి వచ్చిందని, ప్రస్తుతం ఒడిశాలోనూ కోడ్ అమలు ప్రయత్నాలు జరుగుతున్నాయని నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో కూడా రెవెన్యూ కోడ్ అమల్లోకి వస్తే భూమి సమస్యలు, రైతుల ఇబ్బందుల పరిష్కారానికి సమగ్ర వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

### సౌకర్యవంతంగా ఉంటుంది

దేశవ్యాప్తంగా 5 వేలకుపైగా భూ చట్టాలు అమల్లో ఉన్నాయి. ఆయా రాష్ట్రాల భౌగోళిక, సామాజిక పరిస్థితుల ఆధారంగా ఆయా రాష్ట్రాలు తగిన చట్టాలను అమలు చేసుకుంటున్నాయి. యూపీలో రెవెన్యూ కోడ్ అమల్లోకి వచ్చాక అక్కడ మారిన పరిస్థితుల గురించి క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక కూడా ఇచ్చాం. ప్రతి రాష్ట్రంలో రెవెన్యూ కోడ్ అమల్లోకి వస్తే భూచట్టాల్లో ఉన్న గందరగోళం పోతుంది.

# మిల్టన్ ధాటికి ఫ్లోరిడా అతలాకుతలం

### విద్యుత్ అంతరాయంతో అంధకారంలో 30 లక్షల మంది

### టోర్నడోల ధాటికి ఐదుగురు మృతి

### ఇంకా ముప్పు పొంచి ఉందన్న అధికారులు

### మిల్టన్ తుఫాను ఫ్లోరిడాలో బీభత్సం సృష్టించింది.



భయంకరమైన గాలులు, వర్షంతో నగరాలను అతలాకుతలం చేసింది. సెయింట్ లూసీ కౌంటీలో టోర్నడోల ధాటికి ఐదుగురు మరణించారు. విద్యుత్ లేక 30 లక్షల మంది అంధకారంలో ఉండిపోయారు. బుధవారం రాత్రి 3 కేటగిరీగా తీరం దాటిన తుఫాను తరువాత ఒకటో కేటగిరీకి బలహీనపడింది. అయినా ముప్పు ఇంకా పొంచి ఉందని అధికారులు పునరుద్ఘాటించారు.

టంపా: మిల్టన్ ప్రభావంతో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు ఫ్లోరిడా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. గంటకు 205 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయి. బుధవారం ఉదయం దక్షిణ ఫ్లోరిడాలోని కొన్ని ప్రాంతాల్లో టోర్నడోలు సంభవించాయి. సెయింట్ లూసీ కౌంటీలో టోర్నడోల ధాటికి ఐదుగురు మృతి చెందారు. ఫ్లోరిడా అట్లాంటిక్ తీరంలోని ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఫోర్ట్ మైయర్స్‌లో మరో టోర్నడో ధాటికి చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్థంభాలు నేలకొరగడంతో రాష్ట్రవ్యాప్తంగా 33 లక్షల మంది అంధకారంలో ఉండిపోయారు. హార్డీ కౌంటీ, హైలాండ్స్ కౌంటీతో సహా పలు ప్రదేశాల్లో 90% మందికి విద్యుత్ అంతరాయం కలిగింది. సానిబెల్ నగరంలో రోడ్లన్నీ వరదతో ముంచెత్తాయి. రహదారులపై 3 అడుగుల మేర నీరు చేరింది. వరదలతో టంపా చుట్టుపక్కల ప్రాంతాలన్నీ మునిగిపోయాయి. నేపుల్స్‌లో రికార్డు స్థాయిలో నీరు నిలిచింది. తుఫాను ధాటికి తీవ్ర ప్రాణ నష్టం జరిగి ఉంటుందని, అయితే ఎంత మంది చనిపోయారనేది చెప్పలేమని అధికారులు వెల్లడించారు.

### అత్యధిక వర్షపాతం...

సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో 41 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. వెయ్యేళ్లలో ఇదే అత్యధిక వర్షపాతం. ఈదురు గాలులు ట్రోపికానా ఫీల్డ్ పైకప్పును చీల్చాయి. తుపాను ధాటికి పలు క్రేన్లు కూడా కూలిపోయాయి. మంచి నీటి సరఫరాను సైతం నిలిపేశారు. సుదీర్ఘ విద్యుత్ అంతరాయాలు, మురుగునీటి పారుదల వ్యవస్థ సైతం మూతపడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఓర్లాండోలో వాల్ డిస్నీ వరల్డ్, యూనివర్సల్ ఓర్లాండో, సీ వరల్డ్ సంస్థలు గురువారం మూతపడ్డాయి. పలు ఫ్లోరిడా విమానాశ్రయాలను నిరవధికంగా మూసివేశారు. హరికేన్ కలిగించిన నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

### పొంచి ఉన్న ముప్పు..

హెలెన్ హరికేన్‌తో ఇప్పటికే దెబ్బతిన్న ఫ్లోరిడాను మిల్టన్ మరింత దుస్థితిలోకి తీసుకెళ్లింది. ఈ ఏడాది అమెరికాను తాకిన ఐదో హరికేన్ ఇది. ఫ్లోరిడాలోని అట్లాంటిక్ తీరానికి 75 మైళ్ల దూరంలో మిల్టన్ కేంద్రీకృతమై ఉందని నేషనల్ హరికేన్ సెంటర్ (ఎన్‌హెచ్‌సీ)తెలిపింది. దీని ప్రభావంతో తూర్పు మధ్య, ఈశాన్య ఫ్లోరిడాలో ఈదురుగాలులు వీస్తాయని, ఫ్లోరిడా, జార్జియా, దక్షిణ కరోలినా తూర్పు తీరం వెంబడి తుఫాను ముప్పు ఇంకా ఉందని వెల్లడించింది. అధికారులు ఫ్లోరిడా, ఇతర రాష్ట్రాలకు చెందిన 9,000 మంది నేషనల్ గార్డ్ సభ్యులతో సహాయక చర్యలు చేపట్టారు. కాలిఫోర్నియా వరకు 50,000 మందికి పైగా యుటిలిటీ కార్మికులను అందుబాటులో ఉంచారు. టంపా, సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని 60 శాతానికి పైగా గ్యాస్ స్టేషన్లలో బుధవారం రాత్రే గ్యాస్ నిండుకోవడంతో గ్యాసోలిన్ ట్యాంకర్లను తరలించడానికి సైరన్లతో హైవే పెట్రోలింగ్ కార్లు పనిచేస్తున్నాయి.

# భారత'రతన్'కు ఘన వీడ్కోలు..

### పారిశ్రామిక దిగ్గజానికి శ్రద్ధాంజలి ఘటించిన భరతజాతి

### అంతిమయాత్ర దారిపొడవునా వాహనం వెంట నడిచిన అభిమానులు

### అధికారిక లాంఛనాలతో ముగిసిన రతన్ టాటా అంత్యక్రియలు

### పార్శీల సంప్రదాయానికి భిన్నంగా విద్యుత్ దహనవాటికలో నిర్వహణ



ముంబై: పారిశ్రామిక దిగ్గజం, దాతృత్వ శిఖరం, టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటాకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, అభిమానుల అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు పలికారు. ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆస్పత్రిలో బుధవారం రాత్రి తుది శ్వాస విడిచిన రతన్ టాటా అంత్యక్రియలు గురువారం ముంబైలోని వర్లీ శ్మశానవాటికలో మహారాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో పూర్తయ్యాయి. రతన్ టాటా పార్శీ అయినప్పటికీ విద్యుత్ దహనవాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

తరలివచ్చిన అభిమానగణం

ముంబైలోని కొలాబాలో ఉన్న రతన్ టాటా స్వగృహానికి ప్రముఖులు భారీగా తరలివచ్చారు. ఆయన పార్థివదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఆ తర్వాత అధికారిక లాంఛనాల్లో భాగంగా ఆయన భౌతికకాయంపై జాతీయ జెండాను ఉంచి ప్రత్యేకంగా అలకరించిన వాహనంలో ఇరువైపులా పోలీసులు వెంటరాగా దక్షిణ ముంబైలో ఉన్న నేషనల్ సెంటర్ ఫర్ పర్ఫామింగ్ ఆర్ట్స్ (ఎన్‌సీపీఏ) మైదానానికి తీసుకొచ్చారు. దారి పొడవునా ఆయన అభిమానులు వాహనం వెంట నడిచారు. పోలీసు బ్యాండ్ ప్రత్యేక ట్యూన్‌ను వాయించింది. ఎన్‌సీపీఏ మైదానంలో మధ్యాహ్నం దాకా ప్రముఖుల సందర్శనార్థం ఉంచారు. అనంతరం అక్కడి నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని వర్లీలో ఉన్న మున్సిపల్ శ్మశానవాటికకు అంతిమయాత్ర కొనసాగింది. దారిపొడవునా జనం పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్మశానవాటికకు తరలించాక అక్కడ ముంబై పోలీసులు టాటాకు గౌరవసూచికగా గన్ సెల్యూట్ చేశారు.

తరలివచ్చిన ప్రముఖులు

వర్లీ శ్మశానవాటికలో సవతి సోదరుడు నోయల్ టాటా, టాటాల కుటుంబ సభ్యులు సహా సినీ, పారిశ్రామిక, సామాజిక, క్రీడా, రాజకీయ ప్రముఖులు, సెలబ్రిటీలు, స్థానికులు, టాటా గ్రూప్ సంస్థల ఉద్యోగులు, పోలీసు ఉన్నతాధికారులు, ఎన్‌సీపీఏ విద్యార్థులు, అంత్యక్రియలకు హాజరయ్యారు. టాటా గ్రూప్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, కేంద్ర మంత్రులు అమిత్ షా, పియూశ్ గోయల్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం ఫడ్నవిస్, మాజీ సీఎం సుశీల్‌కుమార్ షిండే, ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్‌పవార్, ఆయన కుమార్తె సుప్రియా సూలే, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన చీఫ్ రాజ్‌ఠాక్రే, ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా, ఆర్థికరంగ దిగ్గజం దీపక్ పరేక్, ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్, ఎల్ అండ్ టీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, ఏపీ సీఎం చంద్రబాబు, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, నటుడు అమీర్‌ఖాన్, దర్శకుడు మధు భండార్కర్, నటుడు రాజ్‌పాల్ యాదవ్, తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు.రతన్ టాటాకు నివాళిగా గురువారం మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాలు సంతాప దినంగా పాటించాయి. ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను అవనతం చేశాయి.

పాత సంప్రదాయానికి భిన్నంగా..

టాటాలు జొరాస్ట్రియన్ మతంలోని పార్శీ వర్గానికి చెందిన వాళు.. సాధారణంగా పార్శీల అంత్యక్రియల తర్వాత పార్థివదేహాన్ని దహనం, ఖననం చేయరు. రాబందులకు ఆహారంగా ఒక కొండ శిఖరంపై వదిలేస్తారు. ప్రకృతి వరప్రసాదంగా శరీరంతో భువి మీదకు వచ్చిన మనిషి తిరిగి స్వర్గస్తులైనప్పుడు ఆ శరీరాన్ని మళ్లీ ప్రకృతికే విడిచిపెట్టాలని జొరాస్ట్రియన్లు విశ్వసిస్తారు. దహనం చేసి గాలిని, ఖననం చేసి నేల, నీటిని కలుషితం చేయడాన్ని వాళ్లు పాపంగా భావిస్తారు. టవర్ ఆఫ్ సైలెన్స్‌గా పిలిచే ప్రాంతంలో పార్థివదేహాన్ని వదిలేస్తారు. అక్కడ రాబందులు శరీరాన్ని ఆహారంగా తీసుకుంటాయి. అయితే కాలక్రమంలో రాబందుల సంఖ్య తగ్గిపోవడంతో కొందరు ఆధునిక పార్శీలు ఈ ప్రాచీన సంప్రదాయం నుంచి 'ఎలక్ట్రిక్ దహనం' విధానానికి మళ్లారు. టాటా గ్రూప్ మాజీ చైర్మన్, షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ వారసుడు, పార్శీ అయిన సైరస్ మిస్త్రీ అంత్యక్రియలూ 'టవర్ ఆఫ్ సైలెన్స్'కు బదులు 2022లో వర్లీలోని అదే ఎలక్ట్రిక్ దహనవాటికలో జరిగాయి. గురువారం రతన్ టాటా అంత్యక్రియలనూ అలాగే పూర్తిచేసినట్లు అక్కడి క్రతువుకు సాయపడిన మతాధికారుల్లో ఒకరైన పెరీ కంబట్ట వెల్లడించారు. అయితే మరో మూడు రోజులపాటు రతన్ టాటా ఇంట్లో పార్శీ సంప్రదాయ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

ఒక టాటా.. ఒక గోవా!

ముంబై: రతన్ టాటా అంత్యక్రియల వద్ద గంభీరమైన వాతావరణంలో అక్కడికి పరుగెత్తుకొచ్చిన ఒక శునకం రతన్ పార్థివదేహాన్ని చూసి మౌనంగా ఉండిపోయింది. తన నేస్తం, యజమాని ఇక లేరని తెల్సి మౌనంగా రోదించింది. అక్కడే ఉంటూ ఆయన భౌతికకాయం నుంచి దూరం జరగబోనని భీష్మించుకుని అక్కడే ఉండిపోయింది. ఒకప్పుడు వీధి కుక్కగా పెరిగి తదనంతరకాలంలో రతన్‌టాటాకు మంచి నేస్తంగా మారిన 'గోవా' శునకం అది. ఒకప్పుడు గాయపడి గోవాలో ఒంటరిగా తిరుగుతున్న చిన్న కుక్క పిల్ల అది. పదేళ్ల క్రితం రతన్ గోవాకు వెళ్లినపుడు ఇది ఆయన కంట పడింది. జంతు ప్రేమికుడైన రతన్ దానిని చేరదీశారు. దాని బాగోగులు చూసుకున్నారు. టాటా గ్రూప్ కేంద్రకార్యాలయం బాంబే హౌస్‌కూ రతన్‌తోపాటు ఇది కూడా వస్తుండేది. గురువారం ఎన్‌సీపీఏ ప్రాంగణంలో రతన్ భౌతికకాయం వద్దకు దీనిని తీసుకొచ్చారు. ''రతన్‌కు ఇది అత్యంత ఆప్తమైన నేస్తం. ఆయన అలా శాశ్వత నిద్రలోకి వెళ్లాక ఇది ఉదయం నుంచి ఇంతవరకు ఏమీ తినలేదు'' అని దాని సంరక్షకుడు చెప్పారు. '' రతన్ టాటాకు శునకాలంటే ప్రేమ. తాజ్‌మహల్ హోటల్ కావొచ్చు, బాంబే హౌస్ కావచ్చు, టాటా సంస్థల ప్రాంగణాల్లో మనకు ఒకప్పటి వీధి శునకాలే మనకు మంచి నేస్తాలుగా స్వాగతం పలుకుతాయి'' అని మహారాష్ట్ర నవని ర్మాణ్ సేన అధ్యక్షుడు రాజ్ ఠాక్రే గుర్తుచేసుకున్నారు. 2018లో బ్రిటన్ యువరాజు ఛార్లెస్ నుంచి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ తీసుకునేందుకు వెళ్లాల్సి ఉంది. సరిగ్గా అప్పుడు ఆయన పెంపుడు శునకం ఒకటి తీవ్ర అస్వస్థతకు గురైంది. ఈ స్థితిలో వీటిని ఇలా వదిలేసి వెళ్లబోనని అవార్డ్ కార్యక్రమాన్ని టాటా రద్దుచేసుకున్నారని ఆయన స్నేహితుడు సుహేల్ సేథ్ చెప్పారు.

## ఉద్యోగులకు ప్రధాని మోదీ భారీ షాక్.. ఇక వారి పోస్టులు ఊస్టే!



**న్యూఢిల్లీ,:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేంద్ర ప్రభుత్వ సెక్రటరీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారనీ, పనితీరు సరిగా లేని లేదా అవినీతి పాలిత ప్రభుత్వ ఉద్యోగులపై నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు అని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సోమవారం కేంద్రమంత్రి, సెక్రటరీలతో జరిగిన సమావేశంలో, ప్రధాని మోదీ CCS (పెన్షన్) నిబంధనల ఫండమెంటల్ రూల్ 56 (జె)ను ప్రస్తావించారు. ఈ నిబంధన ప్రకారం, సబంధిత అధికారులకు ఆ ఉద్యోగి, ప్రజల ఆసక్తికి అనువుగా లేరని భావిస్తే, ఆ ఉద్యోగి రాజీనామా చేయాలి. ఢిల్లీ వర్గాల ప్రకారం, రాజీనామా చెయ్యాల్సిన ఉద్యోగికి కేంద్రం మూడు నెలల నోటీస్ లేదా ఆ కాలానికి సరిపడే వేతనాన్ని, అలవెన్సులను అందించాలని కూడా నిర్ణయించింది. ఈ సమావేశం హర్యానా, జమ్మూకాశ్మీర్ ఎన్నికల ఫలితాల తర్వాత జరిగింది. రూల్ 56 (జె) ప్రకారం, 55 ఏళ్లు పైబడిన ఉద్యోగులు లేదా 30 సంవత్సరాలు పూర్తి చేసినవారు ప్రభావితమవుతారని తెలుస్తోంది. నియామక సంస్థల అధికారం, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఉద్యోగిని రిటైర్ చేయవచ్చని రూల్ 48 చెబుతోంది. రిటైర్ అయిన వారు ఈ నిర్ణయాన్ని కోర్టులో సవాల్ చేయవచ్చు. ఇప్పటివరకు 500 కంటే ఎక్కువ మంది ఉద్యోగులను ఈ రూల్ కింద బలవంతంగా రిటైర్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ పనితీరు చూపించాల్సిన అవసరం ఉందనీ, ప్రజల సమస్యలను పరిష్కరించాలనీ ప్రధాని మోదీ స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారని తెలిసింది. ఉన్నతాధికారుల ప్రస్తుత స్క్రీనింగ్ ప్రక్రియను కూడా సవరణ చేయబోతున్నారని తెలిసింది. ఇది ఉద్యోగుల ర్యాంక్‌పై కాకుండా సెట్ చేసిన ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది. సమావేశంలో, "మంచి పాలన, అభివృద్ధి పనులకు" ప్రోత్సాహం లభిస్తుందని ప్రధాని మోదీ తెలిపారు. హర్యానాలో బీజేపీ విజయం, జమ్మూకాశ్మీర్ చరిత్రలోనే ఉత్తమ ప్రదర్శనను బీజేపీ ఇవ్వడంతో ఆ సందర్భంగా ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారని తెలిసింది. ప్రధానమంత్రి మోదీ, ఉన్నతాధికారులు, మంత్రులు ప్రజా ఫిర్యాదులను సమగ్రంగా, వేగంగా పరిష్కరించాలని కోరారు. అలాగే, ప్రతి వారం ఒకరోజు ఈ ఫిర్యాదులను పరిష్కరించేందుకు కేటాయించాలని సెక్రటరీలకూ, ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని మంత్రులనూ ఆదేశించారు.

## ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ పై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు





**హైదరాబాద్, :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. షాద్ నగర్ నియోజకవర్గంలోని కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ కొడుకు, కూతురు, అల్లుడుకి పదవులు ఇచ్చారు. కానీ పేదలకు పదవులు రావద్దా..? అని ప్రశ్నించారు. నాణ్యమైన విద్యను అందిస్తుంటే.. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ నేతల మాటలు పట్టుకొని ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. మిత్రుడు ప్రవీణ్ కుమార్ ఏ పార్టీలోనైనా ఉండొచ్చు..అది మీ ఇష్టం. కానీ గురుకుల కార్యదర్శిగా పని చేసిన మీరు విద్య గురించి ఇలా మాట్లాడటం బాలేదన్నారు. ఎవ్వరితోనైనా చెలగాటం ఆడవచ్చు. కానీ టీచర్లతో చెలగాటం ఆడవద్దు.. పోలింగ్ రోజు బూతుల వద్ద వారి మనపై ప్రతాపం చూపిస్తారు. మిత్రుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్.. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యనందించేదుకు ప్రణాళికలు రూపొందిస్తుంటే.. బీఆర్ఎస్ నేతల మాటలు పట్టుకొని మీరు విమర్శలు చేస్తున్నారు. దొరల కాలంలో పేదలకు విద్య అందలేదని.. విద్యాశాఖ బలోపేతం కోసమే కొత్త నియామకాలు చేపడుతున్నట్టు తెలిపారు.

## చైనాకు పాకిస్థాన్ భారీ గిఫ్ట్..



చైనా ప్రధాని లీ కియాంగ్‌కు పాకిస్థాన్ కొత్త గిఫ్ట్ ఇచ్చింది. ఈ రోజు ఉదయం, చైనా ఇంజనీర్లను చంపిన ఇద్దరు ఉగ్రవాదులను పాకిస్థాన్‌కు రాకముందే జైలుకు తరలించే పేరుతో..పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఐఎస్ఐ సినిమా శైలిలో వారిని హతమార్చింది. అయితే వారితో పాటు ప్రయాణిస్తున్న ఇతర జైలు వ్యాన్‌లో కూర్చున్న పోలీసు అధికారులు, ఇతర ఉగ్రవాదులందరూ దాడి నుంచి బయటపడ్డారు. జూలై 14, 2021న పాకిస్థాన్‌లోని దాసులో చైనా ఇంజనీర్లతో నిండిన బస్సుపై టెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్ తీవ్రవాదులు భారీ ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఆత్మాహుతి దాడిలో నలుగురు చైనీస్ ఇంజనీర్లు సహా 12 మంది చనిపోయారు. ఈ ఘటన తర్వాత పాకిస్థాన్‌పై చైనా తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. చైనా వ్యతిరేకతకు భయపడి, పాక్ పరిపాలన ఈ కేసులో ప్రమేయం ఉన్న ఇద్దరు ఉగ్రవాదులను అరెస్టు చేసింది. ముహమ్మద్ హుస్సేన్, అతని సహచరుడు, అయాజ్ అలియాస్ జహాంజేబ్‌ను అరెస్ట్ చేసింది. విచారణ జరిపింది. 2022లో కోర్టు వారిద్దరికీ మరణశిక్ష విధించింది. అరెస్టు చేసిన తర్వాత ఈ ఇద్దరు ఉగ్రవాదులను వేర్వేరు జైళ్లలో ఉంచారు. తాజా పరిణామాల ప్రకారం ఈ ఇద్దరు ఉగ్రవాదులను ఈ ఉదయం సాహివాల్‌లోని హై సెక్యూరిటీ జైలుకు తరలించారు. వీరితో పాటు మరికొందరు ఉగ్రవాదులు, పోలీసు బందోబస్తును కూడా జైలు వ్యాన్‌లో మోహరించారు. పాకిస్థాన్ పోలీసుల కథనం ప్రకారం.. ఈ జైలు వ్యాన్‌పై ఉగ్రవాద సంస్థ తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ దాడిలో చైనా ఇంజనీర్లను హతమార్చిన ఉగ్రవాదులిద్దరూ హతమయ్యారు. కాగా..వారితో పాటు ప్రయాణిస్తున్న ఇతర జైలు వ్యాన్‌లో కూర్చున్న ఇతర ఉగ్రవాదులు, పోలీసులకు ఎలాంటి గాయాలు కాలేదు. దాడి చేసిన వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. కానీ ఇది పాక్ చైనాకు ఇచ్చిన గిఫ్ట్ అని అందరూ అభిప్రాయపడుతున్నారు.

## ఏపీకి కేంద్రం శుభవార్త..
## గోదావరి పుష్కరాలకు భారీగా నిధులు



**అమరావతి,:** ఏపీలోని కూటమి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఏపీలో జరగబోయే గోదావరి పుష్కరాలకు కేంద్ర ప్రభుత్వం 100 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2027లో జరగనున్న గోదావరి నది పుష్కరాలకు కేంద్ర ప్రభుత్వం 100 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేసింది. తూర్పుగోదావరి జిల్లాకు గోదావరి పుష్కరాలు నిర్వహించడం కోసం 100 కోట్ల రూపాయలు నిధులు కేటాయింపులు జరిగాయి. 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని అఖండ గోదావరి ప్రాజెక్ట్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం తూర్పు గోదావరి జిల్లాకు ఈ నిధులు కేటాయించారు. ఈ దిశగా టూరిజం శాఖ అధికారులు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. మరోవైపు.. 2027లో జరిగే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. దీనికి సంబంధించి ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నివేదిక రూపొందించాలని ఇప్పటికే అధికారులను ఆదేశించారు.

# అక్షరాలా భారత రత్నమే!



నిదానంగా కదులుతూ... ముక్కుసూటిగా మాట్లాడుతూ... విలువలను ఎత్తిపడుతూ కూడా అన్యులకు అసాధ్యమైన సమున్నత శిఖరాలను చేరుకోవచ్చని ఆరు దశాబ్దాల తన ఆచరణతో దేశానికి చాటిచెప్పిన దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా బుధవారం రాత్రి కన్నుమూశారు. ఆయన అక్షరాలా రత్నం. సార్థక నామధేయుడు. చెదరని వినమ్రత, సడలని దృఢ సంకల్పం, లక్ష్యసాధనకు ఎంత దూరమైనా వెళ్లే లక్షణం... విశాల టాటా సామ్రాజ్యంలో ఆయనను విలక్షణ వ్యక్తిగా నిల బెట్టాయి. కనుకనే మూడు దశాబ్దాల పాటు ఆ సామ్రాజ్యానికి ఆయన అక్షరాలా చక్రవర్తిగానే వ్యవహరించారు. నిజమే... ఆయన 1962లో సాధారణ ఉద్యోగిగా చేరిననాటికే దేశంలో అదొక అత్యున్నత శ్రేణి సంస్థ కావొచ్చుగాక. పైగా సంస్థ సారథులకు ఆయన అతి దగ్గరివాడు, బంధు వర్గంలో ఒకడు కూడా! కానీ ఆయన ఎదుగుదలకు తోడ్పడినవి అవి కాదు. ఆయన అంకితభావం, దీక్షాదక్షతలు, నిరంతర తపన ఆయనను అంచెలంచెలుగా పైపైకి చేర్చాయి. పేరుకు ఒక సంఘటిత సంస్థే అయినా, అప్పటికే లక్షలమంది సిబ్బందికి చల్లని నీడనిచ్చే కల్పవృక్షంగా పేరుతెచ్చుకున్నా... టాటాల సామ్రాజ్యం విభిన్న సంస్థల సమాహారం మాత్రమే! అందులో సమష్టితత్వం, దిశ, దశా నిర్దేశించే ఉమ్మడి తాత్విక భూమిక శూన్యం. జమ్‌షెడ్జీ టాటా, జేఆర్‌డీ టాటా వంటివారు నేతృత్వం వహించిన ఆ సంస్థలో నాయకత్వ స్థానం దక్కాలంటే అడుగడుగునా అవరోధాలు తప్పలేదు. నెత్తురు చిందకపోవచ్చు... గాయాల జాడ లేకపోవచ్చు, కానీ రోమన్ సామ్రాజ్యకాలం నాటి కలోసియంలను తలపించే బోర్డు రూంలో తన ఆలోచనలనూ, తన భావనలనూ బలంగా వినిపించి ప్రత్యర్థుల వాదనలను పూర్వపక్షం చేయటం మాటలు కాదు. తన ప్రతి పలుకూ, ప్రతి వివరణా నిశితంగా గమనించే, ప్రశ్నించే ఆ బోర్డు రూంలో గెలవటం సాధారణం కానే కాదు. కానీ రతన్ అవన్నీ అవలీలగా చేయగలిగారు. నిష్క్రమిస్తున్న చైర్మన్‌జేఆర్‌డీ టాటా ఆశీర్వాదం పుష్కలంగా ఉన్నా అప్పటికే భిన్న సంస్థలకు సారథులైనవారు సామాన్యులు కాదు. అప్పటికింకా టిస్కోగానే ఉన్న టాటా స్టీల్‌కు రూసీ మోదీ సారథి. పారిశ్రామిక రంగంలో ఆయన మోత మోగిస్తున్నాడు. జమ్‌షెడ్‌పూర్‌లో కొలువుదీరిన ఆ సంస్థకాయన మకుటంలేని మహారాజు. అజిత్ కేర్కర్ ఇండియన్ హోటల్స్‌లో తనదైన ముద్ర వేసుకున్నాడు. దర్బారీ సేల్ టాటా కెమికల్స్‌లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. వీళ్లెవరూ రతన్ టాటాను సీరియస్‌గా తీసుకోలేదు. అతన్ని అవలీలగా అధిగమించవచ్చనుకున్నారు. రతన్ తన పేరులో చివరున్నరెండక్షరాల పుణ్యమా అని ఇంత దూరం వచ్చాడు తప్ప 'సరుకు' లేదనుకున్నారు. ఆయన రాకపై ఆలోచించటం సమయాన్ని వృథా చేసుకోవడమే అనుకున్నారు. కానీ రతన్ పరిశీలనాశక్తి అమోఘ మైనది, అనితర సాధ్యమైనది. ఈ మహాసామ్రాజ్యంలో ఏం జరుగుతున్నదో, లోపాలేమిటో అచిర కాలంలోనే పసిగట్టాడు. తళుకుబెళుకులకు తక్కువేం లేదు. మదుపుపరులకు ఎప్పటికప్పుడు లాభాల పంటా పండుతోంది. కానీ అట్టడుగున అవాంఛనీయమైన పోకడలు కనబడుతున్నాయి. వాటిని చక్కదిద్దితేసంస్థను మరిన్ని రెట్లు పెంచి ఘనతరమైనదిగా తీర్చిదిద్దటం అసాధ్యమేమీ కాదని ఆయన నిర్ణయించుకున్నాడు. 1991 నాటికే దేశంలో అడుగుపెట్టిన ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో పాత పద్ధతిలోనే టిస్కోను కొనసాగిస్తే త్వరలోనే అది గ్రూపు చేజారటం ఖాయమన్న నిర్ణయానికొచ్చాడు. జేఆర్‌డీ మంచితనమో, గమనించలేని తత్వమో గానీ... టాటా స్టీల్‌లో అప్పటికి టాటాలకున్న ప్రమోటర్ వాటా కేవలం అయిదు శాతం మాత్రమే. ఇదే కొనసాగితే ఏదోనాటికి అది ఎవరి చేతుల్లోకైనా పోవచ్చని రతన్ గ్రహించారు. అదొక్కటే కాదు... గ్రూపు సంస్థల్లో ఏ ఒక్కటీ చేజారకుండా ప్రమోటర్ వాటాను గణనీయంగా పెంచారు. సొంత సంస్థలను పదిలపరచుకోవటమే కాదు, ఖండాంతర ఆంగ్లో-డచ్ స్టీల్ సంస్థ కోరస్‌ను వశపరుచుకున్నారు. ఒకప్పుడు తనకు అవరోధంగా నిలిచిన అమెరికన్ దిగ్గజ సంస్థ ఫోర్డ్ నుంచి జాగ్వార్ ల్యాండ్‌రోవర్‌ను టాటాల తీరానికి చేర్చారు. వర్తమానంలో పారిశ్రామికవేత్తల ఎదుగుదల ఎలా సాధ్యమవుతున్నదో బాహాటంగానే కనబడుతోంది. కానీ రతన్ టాటా ఇందుకు భిన్నం. టాటా సంస్థలపై మచ్చపడకుండా, వక్రమార్గాల జోలికిపోకుండా నిదానంగా తన ప్రస్థానం సాగించారు. ఆయన పట్టిందల్లా బంగారమేనని చెప్పడానికి లేదు. కోరస్ టేకోవర్ అయినా, నానో కారు ఉత్పత్తి ఉబలాటమైనా, టాటా గ్రూప్ సంస్థల చైర్మన్‌గా సైరస్ మిస్త్రీ ఆగమన, నిష్క్రమణల్లో అయినా రతన్ వైఫల్యాలు స్పష్టంగా కనబడతాయి. అందుకాయన విమర్శలను ఎదుర్కొనక తప్పలేదు. అలాగే టాటా స్టీల్‌ను దాదాపు 1,200 కోట్ల డాలర్ల విలువైన సంస్థగా తీర్చిదిద్దినప్పుడూ, దేశీయ విద్యుత్ ఆధారిత వాహన రంగంలో టాటా మోటార్స్‌ను మార్కెట్ లీడర్‌గా ముందుకు ఉరికించినప్పుడూ ఆయన గర్వం తలకెక్కించుకోలేదు. ఇవాళ్టి రోజున బహుళజాతి సంస్థల సమాహారంగా ఖండాంతరాల్లో వెలుగు లీనుతున్న టాటా గ్రూప్ నిరుటి రెవెన్యూ 16,500 కోట్ల డాలర్లు. ఆయన వ్యక్తిగత ఆదాయమే కొన్ని వందల కోట్లు. అయినా చివరి వరకూ అతి సాధారణ జీవితం గడిపి, అసహాయులకు అండదండలందించి జీవితాన్ని ధన్యం చేసుకున్న రతన్‌కు కొందరు కోరుకుంటున్నట్టు 'భారతరత్న' ప్రకటిస్తే అది ఆ అత్యున్నత పురస్కారానికి మరింత వన్నె తెస్తుంది. ఆ మహామనీషికి 'సాక్షి' వినమ్రంగా నివాళులర్పిస్తున్నది.

# ఎందుకీ వంచన...



ప్రభుత్వాలు పటిష్టమైన సామాజిక రక్షణ పథకాలను అమలు జరపనట్లయితే వచ్చే దశాబ్ది కాలంలో ఆసియాలో 26కోట్ల మంది దారిద్ర్యంలోకి దిగజారతారని మంగళవారంనాడు వెల్లడించిన ఐరాస నివేదిక హెచ్చరించింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో దారిద్ర్యం పెరుగుతోందని, అసమానతలు విస్తరిస్తున్నాయని కూడా ఆందోళన వ్యక్తం చేసింది. మొత్తంగా చూసినపుడు ఈ ప్రాంతంలోని 45శాతం జనాలకు సామాజిక భద్రతా పథకాలు అమలు కావటం లేదు. అమలు జరుగుతున్న పథకాలు కూడా ఎంతమందికి మేలు చేస్తున్నాయన్నది ప్రశ్న. ఈ నివేదిక ఆసియా గురించి చెప్పింది గనుక మనదేశం మినహాయింపు కాదు. మన కేంద్ర ప్రభుత్వం జాతీయ సామాజిక సహాయ పథకం సోషల్ ఆడిట్ 2023 నివేదికను విడుదల చేసింది. 1995 నుంచి ఈ పథకం అమలు జరుగుతోంది. దీని ఐదు ఉపపథకాలు ఉన్నాయి. వాటిలో ఒకటైన వృద్ధాప్య పెన్షన్ కింద అరవై సంవత్సరాలు నిండితే నెలకు రూ.200, 80ఏండ్లు దాటితే రూ.500 ఇస్తున్నారు. ఈ మొత్తాలు ఏమూలకు సరిపోతాయో పాలకపార్టీ పెద్దలు చెప్పాలి. పొరుగు రాష్ట్రం ఏపీలో నెలకు నాలుగు వేలు గరిష్టంగా ఇస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో వెయ్యి రూపాయలకు మించి ఇవ్వటం లేదు, ఇది కేంద్ర ప్రభుత్వ పథకమైనా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచకుండా పాతికేండ్ల నాటి మొత్తాలే ఇస్తున్నది. అంతర్జాతీయ సంస్థల దృష్టిలో ఇదొక ఉద్దరణ పథకం. ఒకవైపు కోట్లాది మందిని దారిద్ర్యరేఖనుంచి ఎగువకు తెచ్చి ఉద్ధరించినట్లు మోడీ తన జబ్బలను తానే చరుచుకుంటారు. మరోవైపు సామాజిక సంక్షేమం కింద 80కోట్ల మందికి ఉచితంగా బియ్యం, గోధుమలు ఇస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటారు. అంటే వారంతా దారిద్ర్యంలో ఉన్నట్లే కదా! ఎందుకీ వంచన? విషాదకరమైన అంశం ఏమిటంటే అసలు దారిద్ర్యరేఖకు ప్రాతిపదిక ఏమిటన్న దానిమీద ఇంతవరకు ఏకాభిప్రాయం లేదా ప్రమాణం లేదు. సాంకేతికంగా ఒక ప్రాతిపదికను గుర్తించినప్పటికీ అనేక దేశాల్లో దానికి ఎగువన అనేక కోట్లమంది ఎప్పుడైనా దారిద్ర్యంలో తిరిగి కూరుకుపోయే వారిగా వున్నారు. ఇది ఎలా అంటే గోచిపాత రాయుడు దుర్భర దారిద్ర్యంతో ఉన్నట్లు, చాలీచాలని అంగవస్త్రం చుట్టుకుంటే దాన్నుంచి బయటపడినట్లు పరిగణించటంగా చెప్పవచ్చు. అనుకోని అవాంతరాలు ఏర్పడితే అంగవస్త్రం కూడా కొనుక్కోలేరు. అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్న ప్రపంచ బ్యాంకు 2017లో దుర్భర దారిద్ర్యరేఖ ప్రమాణంగా రోజుకు పిపిపి పద్ధతిలో ప్రతిమనిషికి 1.9డాలర్లుగా ఉన్న దాన్ని 2.15 డాలర్లకు పెంచి అంతకంటే తక్కువ ఆదాయం వచ్చేవారిని గర్భదరిద్రులుగా వర్గీకరించింది. మన కరెన్సీలోకి దీన్ని మార్చుకుంటే రోజుకు ప్రతిమనిషికి రూ.180 కంటే తక్కువ వచ్చేవారని అర్థం. ఎవరికి వారు దీన్ని వర్తింపచేసుకుని తామెక్కడ ఉన్నదీ అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలో అత్యధిక ధనవంతమైన దేశంగా పరిగణించే అమెరికాలో అంతకంటే తక్కువ రాబడి వచ్చేవారు 1.2శాతం ఉన్నారు. ఈ కారణంగానే మన దేశంలో ఉచిత బియ్యం ఇస్తున్నట్లు అక్కడ పేదలకు ఆహార కూపన్లను ప్రభుత్వం ఇస్తున్నది. ఇండ్లు లేని వారు మనదేశంలో రోడ్ల మీద పడుకున్నట్లే అక్కడ పార్కుల్లో, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ఉండేవారు కూడా ఉన్నారు. మనదేశాన్ని 2047 నాటికి ఎక్కడికో తీసుకుపోతామని చెబుతున్న నరేంద్రమోడీ, ఆయనకు భజన చేసే చంద్రబాబు, నితీష్కుమార్ వంటి వారు కొలువై ఉన్న మనదేశంలో గర్భదరిద్రులు 12.9శాతం(2022) మంది ఉన్నారు. ఇది ప్రపంచ సగటు తొమ్మిదిశాతం కంటే ఎక్కువ. అదే 3.65 డాలర్లను తీసుకుంటే 44శాతం, 6.85 డాలర్లను తీసుకుంటే 81.8శాతం ఉన్నారు. ప్రపంచ సగటును చూస్తే ఈ తరగతికి కిందకు వచ్చే వారు 9-22.4-44.9 శాతం వంతున ఉన్నారు. కమ్యూనిస్టు నియంతల దేశం, అక్కడ ప్రజాస్వామ్యం ఉండదు అని చెప్పే చైనాలో ఈ అంకెలు వరుసగా 0-0.1-17(2020 సంవత్సరం ప్రపంచబ్యాంకు సమాచారం)శాతం మాత్రమే. ప్రపంచబ్యాంకు సమాచారం ప్రకారం..2019లో 2.15 డాలర్ల కంటే తక్కువ వచ్చే వారు 64.8కోట్ల మంది ఉన్నారు. ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ చెబుతున్నదాని ప్రకారం రోజుకు 1.25 డాలర్ల కంటే తక్కువ ఆదాయం వచ్చేవారు ఆసియా-పసిఫిక్లో 70కోట్ల మంది ఉన్నారు. నిజానికి ఈ 1.25 డాలర్లన్నది 1988 నుంచి 2005వరకు 15 అతిపేద దేశాలలో ధరలు, కరెన్సీల విలువను పరిగణనలోకి తీసుకొని నిర్ణయించారు. దీన్లో అసియా నుంచి రెండు దేశాలను మాత్రమే తీసుకున్నారు. నాటికి నేటికి వచ్చిన తేడాను పరిగణనలోకి తీసుకుంటే దారిద్ర్య నిర్మూలన, దారిద్ర్యరేఖ నిర్ణయం అంతా అంకెల గారడీ తప్ప మరొకటి కాదు.

# బాదుడే పరిష్కారమా






గోడదెబ్బ.. చెంపదెబ్బ సొంతూళ్లలో దసరాను ఆనందంగా జరుపుకుందామనుకున్న సామాన్య జనాలకు ఇప్పుడు ఈ రెండుదెబ్బలు కలిసి పడుతున్నాయి. పిల్లాజెల్లాతో కలిసి ఊరెళదామనుకుంటే కిక్కిరిసిపోతున్న బస్సులు, రైళ్లు, అయినా అవస్థలు పడుతూనే ఎలాగోలా ఎక్కిపోదామను కుంటే పండగ పేరుతో రెట్టింపు ఛార్జీల బాదుడు వెరసి ప్రయాణమంటేనే ఆందోళన వ్యక్తమవు తోంది. గతేడాది వరకు పండగల సమయాల్లో అదనపు ఛార్జీలు వసూలు చేయని ఆర్టీసీ ఈ సంవత్సరం మాత్రం చడీచప్పుడు లేకుండా వాటిని వడ్డించింది. దసరాకు నడుపుతున్న ప్రత్యేక సర్వీ సుల బేసిక్ ఛార్జీలపై 50శాతం పెంచేసి ప్రయాణీకులపై తీవ్ర భారం మోపింది. దీంతో హైదరాబాద్- ఆదిలాబాద్, హైదరాబాద్- మంచిర్యాల, హైదరాబాద్-సత్తుపల్లి లాంటి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల ఛార్జీలు ఇప్పుడున్న దానికంటే సగటున రూ.150 నుంచి రూ.200 వరకు పెరగటంలో ఆయా సర్వీసుల్లో వెళ్లే జనాలకు చుక్కలు కనబడుతున్నాయి. పండగలు, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే ఇలా అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నా మంటూ ఆర్టీసీ ఉన్నతాధికారులు సెలవిస్తుండటం ఇక్కడ గమనార్హం. ఆయా సందర్భాల్లో ఒక రూట్లో వెళ్లేట ప్పుడు నిండుగా వెళుతున్న బస్సులు, తిరిగొచ్చేటప్పుడు ఖాళీగా రావాల్సి వస్తోందన్నది వారి వాదన. అందువల్ల ఆ నష్టాన్ని కొంతలో కొంత తగ్గించుకునేందుకే అదనపు ఛార్జీలను వసూలు చేస్తున్నామన్నది అధికారగణ వివరణ. వారి వాదనలో, వివరణలో నిజంగా సహేతుకత, శాస్త్రీయత ఉందా? అంటే నూటికి నూరు శాతం లేదనే అంటున్నారు రవాణారంగ నిపుణులు. ప్రజా రవాణా అయిన ఆర్టీసీని నష్టాల ఊబిలోంచి గట్టెక్కించి, లాభాల బాటలో పయనింపజేయాలంటే తాత్కాలిక రాబడి కోసం జనాలను బాదటం మాని, శాశ్వత ఆదాయాన్ని రాబట్టేందుకు మార్గాలను అన్వేషించాలన్నది నిపుణుల సూచన. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నీతి అయోగ్ లెక్కలను తీసుకున్నా, రాష్ట్రంలోని ప్రయాణీకులు, బస్సుల సంఖ్య, ఆక్యుపెన్సీ రేషియో ప్రకారమైనా ప్రభుత్వం, ఆర్టీసీ చేపడుతున్న చర్యలు ఆ సంస్థను గట్టెక్కించకపోగా, ప్రజా రవాణా వ్యవస్థను ప్రయాణీకులకు దూరం చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో పెరగటమే కాదు, ఆ సంస్థ లాభాల బాటలోకి వచ్చిందనేది అధికారిక లెక్కల సారాంశం. ఈ పథకానికి ముందు ఆర్టీసీ బస్సుల్లో ప్రతీరోజూ సగటున 35 లక్షల మంది ప్రయాణిస్తే, ఇప్పుడు ఆ సంఖ్య 55 లక్షలకు చేరింది. అంటే రోజువారీ ప్రయాణీకుల సంఖ్య 20 లక్షలు పెరిగిందన్నమాట. కానీ పెరిగిన పాసింజర్ల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచకపోవటం గమనార్హం. మహాలక్ష్మిని ప్రవేశపెట్టకముందు 9,100 బస్సులుంటే, ఇప్పుడు కూడా వాటి సంఖ్య అంతే ఉండటం ప్రయాణీకుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. నిటి అయోగ్ లెక్కల(దేశ సగటు ప్రకారం)ను బట్టి జనాభాలో ప్రతీ వెయ్యి మందికి 1.2 బస్సులుండాలి. ఆ చొప్పున ప్రతీ పది వేల మందికి 12 బస్సులు, అదే లెక్క ప్రకారం నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలకు 48 వేల బస్సులను ఆర్టీసీ తిప్పాలి. కానీ ఇప్పుడు మన తెలంగాణ రోడ్ల మీద తిరుగుతున్నది కేవలం 9 వేల బస్సులే. సర్కారుకు ప్రయాణీకుల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే తక్షణమే 40 వేల బస్సులను కొనుగోలు చేసి, ప్రజా రవాణాను మెరుగుపరచాలి. మహాలక్ష్మి పథకం తర్వాత బస్సుల్లో ఆక్యుపెన్సీ రేటు 100 నుంచి 137 శాతానికి పెరిగిందని సాక్షాత్తూ ఆర్టీసీ పెద్దలే చెబుతున్న క్రమంలో ఇక్కడ మనం ఓ విషయాన్ని గమనించాలి. నిబంధనల ప్రకారం ఒక్కో బస్సులో 50 మందికి మించి ప్రయాణించకూడదు. కానీ బస్సుల సంఖ్య పెరక్క పోవటం, ఈ విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో ప్రస్తుతం సామర్థ్యానికి మించి 150 మంది వరకూ ప్రయాణిస్తున్నారు. దీంతో జనాలు తోసుకుంటూ, తొక్కుకుంటూ, కనీసం గాలి కూడా పీల్చుకునే వెసులుబాటు లేకుండా అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణి స్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే అనేక అవాంఛనీయ సంఘటలు చోటుచేసుకున్నాయి. ముమ్ముందు జరగరానిదే మైనా జరిగితే దానికి బాధ్యులెవరు? ఇలా గణాంకాలు, లెక్కలు, వాస్తవ పరిస్థితులన్నింటినీ చూస్తే ప్రజల అవసరాలకు అను గుణంగా, ప్రయాణీకుల సంఖ్య, ఆక్యుపెన్సీ రేషియో ఆధారంగా బస్సుల సంఖ్యను పెంచటం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాల్సిన ఆర్టీసీ, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని చెప్పక తప్పదు. ఇదే సమ యంలో 'పండగలప్పుడు ప్రయివేటు ట్రావెల్స్ ఛార్జీలను బాదితే తప్పులేదుగానీ, ప్రజా రవాణా వ్యవస్థను కాపాడుకోవటానికి మేం కొంచెం పెంచితే గగ్గోలెందుకు..?' అంటూ ఆర్టీసీ ఉన్నతాధికారులు వితండ వాదన చేయటం విడ్డూరం. అయినా ప్రయివేటు ట్రావెల్స్ అడ్డగోలు దందాను అడ్డుకుని, వాటిని నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది, ఆర్టీసీదే కదా? ఆ పని చేయకుండా ప్రయాణీకులపై భారాలు మోపితే ఏం లాభం?

## "మహాయుతి"లో లుకలుకలు.. కేబినెట్ నిర్ణయాలపై అజిత్ పవార్ అసంతృప్తి..



**న్యూఢిల్లీ,:** మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. మరోసారి అధికారంలోకి రావాలని బీజేపీ -శివసేన(షిండే)- ఎన్సీపీ(అజిత్ పవార్)ల "మహాయుతి" కూటమి భావిస్తుంటే, బీజేపీ కూటమికి ఎలాగైనా చెక్ పెట్టాలని కాంగ్రెస్-శివసేన(ఠాక్రే)-ఎన్సీపీ(శరద్ పవార్)ల "మహావికాస్ అఘాడీ" భావిస్తోంది. నవంబర్ నెలలో ఎన్నికలు ఉండే అవకాశం కనిపిస్తోంది. ఇదిలా ఉంటే, తాజాగా మహారాష్ట్ర అధికార "మహాయుతి" కూటమిలో విభేదాలు కనిపిస్తున్నాయి. తాజాగా ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. కేవలం సమావేశం ప్రారంభమైన 10 నిమిషాలకే అజిత్ పవార్ బయటకు వచ్చేశారు. కేబినెట్ ప్రతిపాదనలను ఆమోదించేందుకు అజిత్ పవార్ నిరాకరించినట్లు సమాచారం. మొత్తంగా కేబినెట్ 38 నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. వీటి గురించి ముందస్తు నోటిఫికేషన్ లేకపోవడం, సమాచారం ఇవ్వకపోవడంపై అజిత్ పవార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సరైన ప్రోటోకాల్ పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. రతన్ టాటాకి కేబినెట్ సంతాపం తెలిపిన తర్వాత అజిత్ పవార్ సమావేశం నుంచి బయటకు వచ్చారు. మహారాష్ట్ర ఎన్నికల ముందు ఇదే చివరి కేబినెట్ సమావేశం. ఆర్థిక ప్రతిపాదనల్ని ఆమోదించే విషయంలో అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సీట్ల ప్రతిపాదన పూర్తి కాకముందే ఇలా ఒకేసారి ఇన్ని ప్రతిపాదనల్ని ఆమోదించే విషయంలో విముఖత వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ఆర్థికమంత్రిగా అజిత్ పవార్ ఉన్నారు.

## నోబెల్ శాంతి బహుమతి విజేత ప్రకటన..



మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈసారి నోబెల్ శాంతి బహుమతి ఎవరికి దక్కుతుందనే దానిపైనే అందరి దృష్టి నెలకొంది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఘర్షణల మధ్య నోబెల్ శాంతి బహుమతి విజేతను ప్రకటించారు. జపాన్‌కు చెందిన నిహాన్ హిడాంకియో సంస్థ నోబెల్ శాంతి బహుమతిని అందుకుంది. ఈ జపనీస్ సంస్థ 'అణ్వాయుధాలు లేని ప్రపంచం'ని సమర్థిస్తుంది. వాస్తవానికి.. ఈ జపాన్ సంస్థ నిహాన్ హిడాంకియో రెండవ ప్రపంచ యుద్ధంలో జరిగిన అణు బాంబు దాడుల బాధితుల కోసం పనిచేస్తోంది. అలాగే.. ఈ సంస్థ ప్రపంచం మొత్తం అణ్వాయుధాల నుంచి పూర్తిగా విముక్తి పొందేలా కృషి చేస్తుంది. ఇజ్రాయెల్-హిజ్బుల్లా యుద్ధం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మధ్య ఈ సంస్థకు 2024 నోబెల్ శాంతి బహుమతి లభించడానికి కారణం ఇదే. ఈ సంస్థ హిరోషిమా, నాగసాకి అణు బాంబు దాడుల బాధితులకు ప్రాతినిధ్యం వహిస్తుంది. తమ అవార్డుతో హిరోషిమా, నాగసాకి అణుబాంబు బాధితులను గౌరవిస్తున్నట్లు నార్వేయన్ నోబెల్ కమిటీ తన ప్రకటనలో తెలిపింది. నోబెల్ కమిటీ ప్రకారం.. అణు రహిత ప్రపంచాన్ని సమర్థించడంలో, అణుయుద్ధం యొక్క భయానక పరిస్థితులపై ఈ సంస్థ చేసిన కృషికి నోబెల్ శాంతి బహుమతిని నార్వేజియన్ నోబెల్ కమిటీ నిహాన్ హిడాంకియోకు అందించింది. 1956లో ఏర్పడిన నిహాన్ హిడాంకియో జపాన్‌లో అణు బాంబు దాడుల నుంచి బయటపడినవారిలో అతిపెద్ద, అత్యంత ప్రభావవంతమైన సంస్థ. అణ్వాయుధాల వినాశకరమైన మానవతా పరిణామాల గురించి ప్రపంచవ్యాప్త అవగాహన పెంచడం దీని లక్ష్యం. అణ్వాయుధాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్త వ్యతిరేకతను సృష్టించడానికి, కొనసాగించడానికి నిహాన్ హిదండక్యో చేసిన తిరుగులేని ప్రయత్నాలకు నోబెల్ కమిటీ ప్రశంసించింది. జపాన్‌లో అణు బాంబు దాడులు జరిగి దాదాపు 80 ఏళ్లు గడిచినా అణ్వాయుధాలు ప్రపంచానికి ముప్పుగా మిగిలాయి. ఈ అవార్డు ప్రపంచ శాంతికి పెరుగుతున్న ముప్పులను గుర్తుచేస్తుంది. అణ్వాయుధాలను ఆధునికీకరిస్తున్నట్లు కమిటీ తెలిపింది. ఇదిలా ఉండగా.. నోబెల్ శాంతి బహుమతిని 1901 నుంచి ఇస్తున్నారు. ఇప్పటి వరకు 104 సార్లు ఆ పురస్కారాన్ని అందించారు. వ్యక్తులతో పాటు సంస్థలకు కూడా నోబెల్ శాంతి పురస్కారాన్ని ప్రకటించారు. గత ఏడాది మహిళల హక్కులు, ప్రజాస్వామ్యం గురించి పోరాడిన ఇరాన్ సామాజిక కార్యకర్త నర్గెస్ మొహమ్మదీకి అవార్డును ఇచ్చారు.

## తెలుగు రాష్ట్ర ప్రజలకు వైసీపీ అధినేత విజయ దశమి శుభాకాంక్షలు..





**అమరావతి,:** మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్ రెడ్డి విజయ దశమి శుభాకాంక్షలు తెలియజేశారు. దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి పండుగలను పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ వైఎస్ జగన్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. లోక కంటకుడైన మహిషాసురుడిని జగన్మాత సంహరించినందుకు, చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే పండగే విజయదశమి అని జగన్ అన్నారు. చెడు ఎంత దుర్మార్గమైనదైనా, ఎంత శక్తిమంతమైనదైనా అంతిమ విజయం మంచినే వరిస్తుందని పేర్కొన్నారు. ఆ జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించాలని, ఆ కనక దుర్గమ్మవారి దీవెనలు, ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని వైయస్ జగన్ ఆకాంక్షించారు. మరోవైపు.. రాష్ట్రంలో దసర ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. దుర్గాదేవీ శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు దుర్గామాత మాలను ధరించి నిష్టగా పూజలు చేస్తున్నారు. అంతేకాకుండా.. రేపు దసరా పురస్కరించుకుని ఇళ్లలో కూడా మహిళలు పూజల్లో పాల్గొంటున్నారు.

## రుణమాఫీ చేస్తాం కానీ అంతవరకు మాత్రమే..



**హైదరాబాద్, :** రైతులు పంటలకోసం తీసుకున్న రుణాలు మాత్రమే మాఫీ అవుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రెండు లక్షలకు పైన రుణం తీసుకున్న రైతులు కూడా ప్రభుత్వం మాఫీ చేస్తుంది కానీ.. పైన రుణం రైతులు చెల్లించాలన్నారు. రుణమాఫీ విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు బ్యాంకులలో సమస్యలు ఉన్నాయన్నారు. రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతులు పంటలకోసం తీసుకున్న రుణాలు మాత్రమే మాఫీ అవుతాయన్నారు. గ్రామాలలో ఉన్న బీఆర్ఎస్ వాళ్లకు ఎంత రుణం మాఫీ అయిందో లెక్కలు తీయాలని ఆగ్రహం వ్యక్తం చేశాఉ. వచ్చే సంవత్సరం జూన్ నెల వరకు అన్ని హంగులతో పాఠశాలను పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 సమీకృత గురుకుల పాఠశాలాలకు శంకుస్థాపన చేయడం సంతోషకరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాఠశాలలో వాడే కరెంటు బిల్లు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పామన్నారు. గత ప్రభుత్వంలో నిరుద్యోగులను పాలకులు మోసం చేశారని మండిపడ్డారు. నోటిఫికేషన్ వేసిన వెంటనే వాళ్లకు సంబంధించిన వ్యక్తులు కోర్టులలో కేసులు వేసి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. కేసీఆర్ బిడ్డ కవితకు అతని బంధువు వినోద్ రావుకు మాత్రం ఉద్యోగాలు పోయాక వెంటనే వారికి ఎమ్మెల్సీ ఇచ్చి ఉద్యోగాలు నియమిస్తారన్నారు. గ్రామాలలో మళ్ళీ ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం కలిగేలా చేస్తామని తెలిపారు. దేశంలో ప్రజలకు ఉపయోగపడే విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకునేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు.

# అభివృద్ధి బాటలో ప్రభుత్వం!



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం వంద రోజుల పాలనను ఇటీవలే పూర్తి చేసుకుంది. అగాధంలో కూరుకుపోయిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే, గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన వ్యవస్థలను పటిష్టం చేస్తూ ప్రజలకు వీలైనంతగా మేలు చేస్తూ జనరంజక ప్రజా పాలన ఇచ్చామని అధికార పక్షం సంతృప్తి వ్యక్తం చేస్తోంది. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ వంద రోజుల్లో నెరవేర్చాలంటే ఏ ప్రభుత్వానికైనా అల్లావుద్దీన్ అద్భుత దీపం కావాలి. రూ.10 లక్షల కోట్లు అప్పులు, లక్ష కోట్లు బకాయిలు వారసత్వంగా సంక్రమించిన క్లిష్ట పరిస్థితిలో అధికారం చేపట్టిన చంద్రబాబు నిరుద్యోగ యువతకు భరోసా ఇచ్చే విధంగా డీఎస్సీ నోటిఫికేషన్, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, సామాజిక పెన్షన్లను రూ.4000 లకు పెంచడం, నైపుణ్య గణన, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణపై మొదటి ఐదు సంతకాలు చేయడం ద్వారా అన్ని వర్గాల సంక్షేమానికి, అభ్యున్నతికి సమాన ప్రాధాన్యత ఇచ్చారు. నిజానికి ఏ ప్రభుత్వ పని తీరును కూడా మొదటి వంద రోజుల్లో బేరీజు వేయడం సబబు కాదు. ఎందుకంటే మంత్రివర్గ కూర్పు, అధికారుల ఎంపిక, ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడం, పాలనలో ప్రాధాన్యతలను గుర్తించడం, నామినేటెడ్ పదవులను భర్తీ చేయడానికే మూడు నెలలు చాలవు. తన పాలన చరమాంకంలో మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న మాట తప్పడమే కాక తనకు ముందు టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన నిరుద్యోగ భృతిని ఆపేసిన చరిత్ర జగన్మోహన్ రెడ్డిది. మరోవైపున ఎన్డీయే ప్రభుత్వం జారీచేసిన డీఎస్సీ నోటిఫికేషన్, పైలట్ ప్రాజెక్టుగా నైపుణ్య గణనను మంగళగిరి నియోజకవర్గంలో ప్రారంభించడం, పారిశ్రామిక వేత్తలను పెట్టుబడులు పెట్టే విధంగా ఆకర్షించడం ద్వారా నిరుద్యోగ యువతకు భరోసా కల్పించేందుకు చేస్తున్న కృషిని విమర్శించడం హాస్యాస్పదం.

### ఆ నైతిక హక్కు వైసీపీకి ఉందా?

సామాజిక పెన్షన్ల విషయానికి వస్తే వైకాపా హయాంలో విడతల వారీగా పెంచి నాలుగున్నరేళ్లకు పెన్షన్ రూ.3000 చేసి 63 లక్షల మందికి ఇస్తే, ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం 2024 ఏప్రిల్‌లో హామీ ఇచ్చిన నాటి నుండే వర్తించే విధంగా ఒకేసారి ఒక్కొక్కరికి రూ.7000 (పెంచిన పెన్షన్ 4000,బకాయిలు 3000) మొత్తం రూ.4800 కోట్లు 65.18 లక్షల మంది పేదవారికి పంపిణీ చేయడం ఎలా మోసం అవుతుంది. రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం విషయంలో త్వరలో నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి అంటున్నారు. ఇక పంటల బీమా విషయానికి వస్తే విపత్తులతో నష్టపోయే రైతులకు ఉదారంగా సాయం చేయడం మాని, పంట నష్ట పరిహారాన్ని తగ్గించి ఇచ్చే కప్ అండ్ క్యాప్ (80-110) బీమా విధానాన్ని (ఇందులో రూ.100 ప్రీమియం కడితే పంట నష్టానికి రూ.110 మించి పరిహారం ఇవ్వరు) ఎంచుకుని రైతాంగాన్ని దారుణంగా వంచించిన గత వైకాపా ప్రభుత్వ పెద్దలకు ఇప్పుడు పంటల బీమా విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు ఉందా?

### ఆర్థికస్థితిని బాగుపర్చడమే లక్ష్యంగా..

వైసీపీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి రైతులకు పెట్టిన బకాయిలు రూ.1674.47 కోట్లు, ఆరోగ్యశ్రీకి పెట్టిన బకాయిలు రూ.1600 కోట్లలో ఇప్పటి వరకు రూ.700 కోట్లు, నీరు-చెట్టు బకాయిలు రూ.256 కోట్లు, రాజధాని కౌలు రైతుల బకాయిలు రూ.400 కోట్లు, పేదల గృహ నిర్మాణ బకాయిలు రూ.50 కోట్లు ఎన్డీయే ప్రభుత్వం చెల్లించింది. ఇంటింటికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకం దీపావళి నుండి అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ప్రజలకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసి పేదల ఆకలి బాధ తీర్చుతున్నారు. విద్యుత్ చార్జీలు పెంచమన్న హామీకి కట్టుబడ్డారు, ఉచిత ఇసుక విధానాన్ని పునరుద్ధరించారు. గ్రామ పంచాయతీలకు రూ.1452 కోట్లు నిధులు జమ చేయడంతో పాటు ఆగస్టు 23న స్వర్ణ గ్రామ పంచాయతీ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో ఒకేరోజు గ్రామ సభలు నిర్వహించారు. పోలవరం, అమరావతి నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిధులు సాధించారు. జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని స్థితి నుండి ప్రభుత్వ ఉద్యోగులు నెలలో మొదటి తేదీనే జీతాలు అందుకుంటున్నారు.

### అదనపు సాయం అందించారు..

ఇటీవల వరదల వల్ల నష్టపోయిన వారికి రూ.602 కోట్ల నిధులతో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ గైడెలైన్స్ ప్రకారం ఇవ్వాల్సిన దానికంటే అదనంగా ప్రభుత్వం సాయం చేసింది. తన పాలనానుభవం, పట్టుదల, కృషితో చంద్రబాబు నాయుడు క్రమంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడానికి నిరంతరం శ్రమిస్తున్నారనేది జగమెరిగిన సత్యం. జగన్మోహన్ రెడ్డి పాలనలో భ్రష్టుపట్టిన అధికార వ్యవస్థను సంస్కరించి, దిగజారిన శాంతిభద్రతలను పునరుద్ధరించి, రాజ్యాంగం ప్రసాదించిన వ్యక్తి స్వాతంత్ర్యాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని .. అదే సమయంలో తప్పు చేసిన అధికారులను చట్టం ముందు నిలబెడతామని అధికార పక్షం స్పష్టం చేస్తోంది.

### మారిన చంద్రబాబు.., సరికొత్త విజన్

చంద్రబాబు .. ఆయనంతే ..మారడు అనే వారికి ఇటీవల ఒక్కసారిగా ఇరవైకి పైగా నామినేటెడ్ పదవులు భర్తీ చేయడం, మిగిలిన వాటిని కూడా త్వరలో భర్తీ చేయడానికి నిర్ణయించడం విస్మయం కలిగించింది. గత ప్రభుత్వం నుండి వారసత్వంగా సంక్రమించిన ఎన్నో సవాళ్లను దీటుగా ఎదుర్కొంటూ, అనుకోని విపత్తుల్ని సమర్థంగా అధిగమిస్తూ, రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు దూసుకెళ్తున్నారు. వరద కష్టాల్లోంచి ప్రజలను బయట పడేయడంలో చంద్రబాబు చూపిన విజన్, పాలన విపత్తు నిర్వహణలో భావితరాలకో పాఠం. వంద రోజుల్లోనే సకారాత్మకమైన తన మార్కు పాలన చూపిన నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆశిద్దాం.

# ఇది చరిత్ర జ్ఞాపకమేనా?



ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రమాదపుటంచుల్లో ఉన్నది. గతమంతా ఘనం..వర్తమానం అస్తవ్యస్తం.. భవిష్యత్ అంధకారం అనే పరిస్థితి సమీపంలోనే కనిపిస్తోంది. తెలంగాణ ఉద్యమానికి చుక్కానిగా నిలిచిన ఉస్మానియా పాలకుల కుట్రలకు బలైపోతోందన్న భయం విద్యార్థులుగా మమ్మల్ని వెంటాడుతోంది.. వెన్నాడుతోంది. ఉస్మానియాను ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ తరహాలో తీర్చిదిద్దుతామన్న గత పాలకుల ప్రకటనలు నీటి మీది రాతలుగానే మిగిలిపోయాయి. దీంతో ఘనచరిత్ర కలిగిన ఉస్మానియా చరిత్ర జ్ఞాపకంగానే మిగిలిపోనుందా అన్నది ప్రశ్న. ఉస్మానియా, ఎంతోమందికి ఉన్నత చదువులు అందించిన విద్యాలయమే కాదు.. మరెంతోమందికి జీవితాలను ప్రసాదించిన తల్లి కూడా. జీవితం శకలుశకలలుగా రాలిపడుతున్నపుడు జీవితం మీద గట్టిగా నిలబడటం ఎలాగో నేర్పిన, నేర్పుతున్న పోరు పాఠశాల. సామాజిక చైతన్యాన్ని అందిస్తున్న ప్రవాహం. అనేక రాజకీయ, సామాజిక, ఆర్థిక విషయాలను విశ్లేషించి తెలంగాణనే కాదు.. దేశం దృష్టిని సైతం ఆకర్షించగలిగిన ఉస్మానియా ఎందుకు కొంతకాలంగా పాలకుల నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురి అవుతున్నది? మొత్తంమీద ఉస్మానియాను బలిపీఠంపై కూర్చోబెడుతున్నారా?

### ఇది కుట్ర కాదా..?

ఉస్మానియా వర్సిటీలో వేళ్ల మీద లెక్కేసే సంఖ్యలోనే ఆయా డిపార్ట్‌మెంట్లలో రెగ్యులర్ ప్రొఫెసర్లు ఉన్నారు. మిగతా వారంతా పార్ట్ టైం, కాంట్రాక్ట్ వాళ్లు. మరికొద్ది రోజుల్లోనే పలు డిపార్ట్‌మెంట్లలో రెగ్యులర్, పార్ట్ టైం ప్రొఫెసర్లు కూడా లేక మూతబడిపోయే పరిస్థితి రానుంది. ఈ విషయం ప్రభుత్వానికి తెలియదా? అంటే అటువంటిదేమీ లేదు. ప్రస్తుత ఇంచార్జ్ వీసీ.. ఐఏఎస్ కాబట్టి ఈ విషయం ప్రభుత్వానికి తప్పనిసరిగా చేరి ఉంటుంది. అందుకు తగ్గట్టుగానే ముఖ్యమంత్రి స్వయంగా ఆగస్టులో 15 రోజుల్లోనే వర్సిటీలో కొత్త రిక్రూట్‌మెంట్ అన్నారు.. వీసీల నియామకం అన్నారు. కానీ తాత్కాలికంగా ఇంచార్జ్ వీసీలను నియమించి సరిపెట్టుకున్నారు. రెండు నెలలు కావస్తున్నా ఇంకా దీనిపై చెప్పుకోదగ్గ ముందడుగు పడకపోవడం విచారకరం.

### మెల్లమెల్లగా వ్యవస్థను నిస్తేజం చేసి..

పేద, మధ్య తరగతి వర్గాల పిల్లలు బడి మెట్లు ఎక్కకముందు ధనవంతుల పిల్లలు సర్కార్ బడిలో ఓనమాలు నేర్చారు. పేద పిల్లలు సర్కార్ బడి మెట్లు ఎక్కగానే వాళ్లు ప్రైవేట్ విద్యను అందుకున్నారు. తీరా అణగారిన పిల్లలు ప్రైవేట్ విద్యను అందుకోగానే వాళ్లు కార్పొరేట్ విద్య వైపు పరుగులు తీశారు. మేము కార్పొరేట్ వైపు కదలగానే.. వాళ్లు విదేశీ విద్య వైపు మళ్లారు. అందుకే పేద పిల్లలు చదువుతున్న ప్రభుత్వ వర్సిటీలను శిథిలాలుగా మార్చే పనిలో ప్రభుత్వాలు ఉన్నట్టు ఈ మొత్తం పరిణామాలను గమనిస్తే స్పష్టం అవుతోంది. గత పదేళ్లుగా ఉస్మానియా నిస్సారంగా మారి ఉసురుమంటుంటే పాలకులు పట్టించుకోవడం లేదంటే కారణం ఏమిటి? ప్రొఫెసర్లు లేక ఓయూ విద్యావ్యవస్థ గాడి తప్పిందనే సంకేతాలను విస్తృతంగా పంపి..విద్యార్థుల శాతాన్ని గణనీయంగా తగ్గించి, న్యాక్ ర్యాంక్ పడిపోయేలా చేసి..విద్యా ప్రమాణాలను దిగజార్చి ఓయూను జ్ఞాపకం చేయాలనే కుట్రపూరిత ఆలోచనను కొట్టిపారేయలేం.

### విద్యార్థి సంఘాలు మేల్కొవాలి..!

ఉస్మానియాకు పేదల పిల్లలే వస్తున్నారు. అందుకే ఈ ప్రఖ్యాతి చెందిన విద్యాలయంపై పాలకుల కుట్ర కొనసాగుతోంది. ఈ కుట్రలకు చరమగీతం పాడకపోతే..రేపు పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన భవిష్యత్ తరాలు వర్సిటీ విద్యను కూడా అందుకోవడం కష్టమే. ప్రైవేట్ స్కూల్ ఎడ్యుకేషన్‌లో చేరడమే భారంగా ఉంది. ఇక ప్రైవేట్ వర్సిటీ చదువులంటారా? అది పేదలకు మరింత భారంగా మారుతుంది. ఉన్నత చదువులు అందని ద్రాక్షగానే మిగిలిపోతాయనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. అందుకే విద్యార్థులు..విద్యార్థి సంఘాలు మేల్కొవాలి. లేదంటే పాలకుల కుట్రలకు ఉస్మానియా బలవ్వడం ఖాయం. కానీ, అది జరుగుతుందా? గతంలో ఉమ్మడి రాష్ట్ర పాలకులు వర్సిటీపై కన్నేసి త్రీ స్టార్ హోటల్ చేద్దామని అనుకుంటే తిరగబడిన ఉస్మానియా.. మరోసారి తన సహజ స్వభావాన్ని అందుకోవాలి. నాకెందుకు అనుకుంటే నష్టపోయేది మనమేనని గుర్తించాలి. లేదంటే మన చదువుల తల్లి..చరిత్ర గర్భంలో ఓ జ్ఞాపకంగా మిగిలే ప్రమాదం ఉంది..ఆలోచించండి.

# ఉపాధిని సృష్టించిన ఉద్యోగి



తరాలకు స్ఫూర్తినిచ్చిన పారిశ్రామికవేత్త రతన్ టాటా, ఈ పేరు తెలియని భారతీయుడు ఉండడు. ఉప్పు నుండి ఉక్కు వరకు.. టీ నుండి ట్రక్స్ వరకు ఇలా ప్రతి దానిలో టాటా పేరు వినబడుతుంది. 23 లక్షల కోట్ల రూపాయల విలువతో, సుమారుగా 8 లక్షల మంది ఉద్యోగులతో మన దేశంలోనే అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యంగా టాటా కంపెనీ మొదటి స్థానంలో నిలిచింది. ఇంత పెద్ద కంపెనీని విజయవంతంగా నడిపించిన వ్యక్తి రతన్ టాటా. ఎంత ఎత్తుకి ఎదిగినా ఒదిగి ఉండే నైజంతో, వేల కోట్ల సంపద ఉన్నా కూడా సాధారణ జీవితం గడిపే అసామాన్యుడు రతన్ టాటా. టాటా అంటే నమ్మకం, టాటా అంటే నిజాయితీ. టాటా అంటే నిలువెత్తు భారతం. టాటా కంపెనీ మొదట ఒక టెక్స్‌టైల్ మిల్‌గా ప్రారంభమైయింది. జంషెట్జీ టాటా అనే ఆయన దీనిని స్థాపించారు. అలా 1868లో మొదలైన ఈ కంపెనీ తరతరాలుగా చేతులు మారుతూ వచ్చింది.

### ఎక్కడ అవమానం పొందాడో అక్కడే...

రతన్ టాటా, ప్రయాణంలో ఎన్నో అవరోధాలను అవమానాలు ఎదుర్కొన్నాడు. దానికి ఒక ఉదాహరణగా చూస్తే. 1998లో రతన్ టాటా .. టాటా ఇండికా కార్లను ప్రవేశపెట్టారు. ఆ కార్లు మొదటి సంవత్సరం ఫెయిల్ అయ్యాయి. దాంతో అందరూ టాటా ఇండికాను అమ్మేయాలని సలహా ఇచ్చారు. దానికి టాటా కూడా ఒప్పుకుని .. ఇండికా కార్ల వ్యాపారాన్ని అమ్మకం కోసం అమెరికాలోని ఫోర్డ్ కంపెనీకి టాటా, ఆయన టీం వెళ్లారు. అయితే ఆ మీటింగ్‌లో ఫోర్డ్ కంపెనీ చైర్మన్, రతన్ టాటాతో మీకు కార్లు ఎలా తయారు చెయ్యాలో తెలియనప్పుడు కార్ల బిజినెస్ ఎందుకు స్టార్ట్ చేశారు అని టాటాను, టీంను అవమానపరిచారు. దాంతో టాటా ఆ ఒప్పందం గురించి చర్చించకుండానే తిరిగి ముంబైకి వచ్చేసారు. కొన్ని సంవత్సరాల తరువాత టాటా ఇండికా నష్టాల నుండి లాభాల బాట పట్టింది. అదే సమయంలో ఫోర్డ్ కంపెనీకి చెందిన లగ్జరీ కార్లు జాగ్వార్ ల్యాండ్ రోవర్ కంపెనీలు భారీగా నష్టాల్లోకి వెళ్లిపోయాయి. ఆ సమయంలో రతన్ టాటా ఫోర్డ్ కంపెనీకి, జాగ్వార్ ల్యాండ్ రోవర్ రెండు కంపెనీలను తాను కొంటానని ఆఫర్ చేశారు. ఈసారి ఫోర్డ్ కంపెనీకి చెందిన టీం అమెరికా నుండి ముంబైకి చేరుకొని టాటాను కలుసుకుంది. అలా నష్టాల్లో ఉన్న జాగ్వర్ లాండ్ రోవర్‌లను 9,300 కోట్ల రూపాయలకు స్వాధీనం చేసుకుని ఆ రెండింటినీ మళ్లీ లాభాల బాట పట్టించారు. ఈ విధంగా ఎవరైతే తనను అవమానించి తక్కువగా చూసారో వాళ్లనే తన దగ్గరికి వచ్చేలా చేసుకున్నారు రతన్ టాటా.

### ప్రపంచ సంపన్నుడు కాదు కానీ...

మరి ఇంత పెద్ద కంపెనీని నడుపుతున్నప్పటికీ రతన్ టాటా భారతదేశంలో గానీ ప్రపంచ ధనవంతుల జాబితాలో గానీ ఏనాడూ కనిపించలేదు. ఎందుకంటే టాటా కంపెనీకి వచ్చే లాభాలలో 66% శాతం టాటా ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలకే వెళ్లి పోతుంది. ఒకవేళ ఈ ఆస్తి అంతా సేవా సంస్థలకి కాకుండా రతన్ టాటాకి చెందినట్లయితే ప్రపంచ ధనవంతుల జాబితాలో మొదటి ముగ్గురిలో రతన్ టాటా తప్పకుండా ఉండేవారు, సాధారణంగా వ్యాపారం అంటే లాభాలు, విస్తరణ, వారసత్వం ఇలా ఉంటుంది. కానీ టాటా అలా కాదు. టాటా గ్రూప్ ఎప్పుడు కూడా తన కుటుంబం కోసమో, వ్యక్తిగత ఆస్తులను కూడపెట్టడం కోసమో వ్యాపారం చెయ్యలేదు. కంపెనీకి వచ్చిన లాభాలలో 66% సమాజ సేవ కోసం ఖర్చు చేసే ఏకైక కంపెనీ ప్రపంచం మొత్తంలో టాటా గ్రూప్ ఒక్కటే.

### యువ శక్తిపై నమ్మకముంచి...

రతన్ టాటాకు యువత మీద, వాళ్ల శక్తి మీద మంచి నమ్మకం ఉంది. అందుకే స్నాప్‌డీల్, పేటీయం కార్దెకో, బ్లూస్టోన్, ఓలా, షియోమి, ఇలా 39కి పైగా స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టి ప్రోత్సహించారు. అలాగే టాటా ట్రస్ట్, దేశంలోని మారుమూల ప్రాంతాలలోని పేద ప్రజలకు విద్య, ఉద్యోగం, ఆరోగ్యాన్ని అందించే దిశగా కృషి చేస్తుంది. ఇప్పటికి మన దేశంతో పాటుగా విదేశాలలో చదువుకుంటున్న ఎన్నో వేల మంది భారతీయ విద్యార్థులకు టాటా ట్రస్ట్ ద్వారా స్కాలర్‌షిప్‌లు అందుతున్నాయి. అలాగే తాజ్ హోటల్‌లో ఉగ్రవాదుల దాడిలో గాయపడిన చనిపోయిన కుటుంబాలకు రతన్ టాటా ప్రత్యేకంగా సేవలందించారు. బిజినెస్ టైకూన్‌గా పేరు తెచ్చుకున్న రతన్ టాటాను.. 2000లోనే పద్మ భూషణ్ వరించింది. 2008లో దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం అయిన పద్మ విభూషణ్‌తో అప్పటి కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, ఒహియో స్టేట్ యూనివర్సిటీ, ఐఐటీ బాంబే, ఐఐటీ మద్రాస్ ఐఐటి ఖరగ్‌పూర్‌తో సహా పలు ప్రతిష్టాత్మక సంస్థల నుంచి గౌరవ డాక్టరేట్‌లను కూడా రతన్ టాటా అందుకున్నారు. బుధవారం రాత్రి భారతదేశపు మెరిసే నక్షత్రం వెలిసిపోయింది. రతన్ టాటా ఆస్తులకు వారసులు ఎవరో తెలియదు కానీ ఆయన ఆశయాలకు వారసులుగా ఉండడానికి సిద్ధమవుదాం.